PRABHATA SURYA

# ప్రభాత సూర్య

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

వేల రూ.5/ - పేజీలు : 8 శనివారం 5 జూలై 2025 సంపుటి: 01, సంచిక : 59

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## వైద్యుల పరిరక్షణ బాధ్యత ప్రజలదే.

**-మాతా శిశు కేంద్ర సూపరింటెండెంట్ సుమన్ రావు**

**సీనియర్ సిటీజేన్స్ ఆధ్వర్యంలో జాతీయ వైద్య దినోత్సవం వేడుకలు.**

**జగిత్యాల** : వైద్యుల పరిరక్షణ బాధ్యత ప్రజలదేనని,ప్రాణాలు పణంగా పెట్టి రోగులకు సేవలంధిస్తున్నామని మాతా శిశు కేంద్ర జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ సుమన్ మోహన్ రావు అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్ర సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రిలో తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ,ఆర్.ఎం. పి.,పి.ఎం. పి.శాఖ ల ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందిస్తున్న మాతా శిశు కేంద్ర,మెడికల్ కాలేజీ,ఐ.ఎం.ఎ.అసోసియేషన్ డాక్టర్లను సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,ఆర్.ఎం.పి.రాష్ట్ర అధ్యక్షుడు రాజా గోపాల్ చారి లు ఘనంగా


విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news


# యుద్ధాన్ని ఆపేశారేం?



- ఆపిందెవరో మోదీ ప్రభుత్వం చెప్పాలి
- పాక్ పీచమణిచే అవకాశాన్ని చేజేతులా కోల్పోయారు
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజం
- పహల్గాం ఘటనపై కేంద్రానికి దేశం యావత్తు అండగా నిలిచింది
- రాజకీయ పార్టీలు కూడా మోదీకి మద్దతుగా గొంతు కలిపాయి
- కీలక సమయంలో చేతులు ఎత్తేయడమే మోదీకి చేతనవుతుంది
- మోదీ మాదిరి అప్పట్లో ఇందిరా గాంధీ భయపడలేదు
- కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు, కార్యకర్తల సమ్మేళనంలో ప్రసంగం

**సూర్య న్యూస్ హైదరాబాద్**

పాకిస్తాన్‌పై యుద్ధాన్ని ఆకస్మికంగా ఎందుకు ఆపేశారో, అసలు ఆపిందెవరో దేశ ప్రజలకు మోదీ ప్రభుత్వం చెప్పాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. పహల్గాం ఘటనపై దేశం యావత్తు కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచిందని చెప్పారు. దేశంలోని అన్ని రాజకీయపార్టీలు మోదీకి మద్దతు ఇస్తూ యుద్ధం చేయాలంటూ గొంతు కలిపాయని గుర్తుచేశారు. అయినా యుద్ధం కొనసాగించకుండా అర్ధాంతరంగా నిలిపివేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దేశానికున్న బలగంతో వీరోచితంగా పోరాడి పాక్ పీచమణిచి పీకకేను స్వాదీనం చేసుకునే అవకాశాన్ని చేజేతులా కోల్పోవడం అత్యంత దురదృష్టకరమంటూ ఖర్గే ధ్వజమెత్తారు. జబ్బలు చరుచుకునే మోదీ కి కీలక సమయంలో చేతులు ఎత్తేయడమే చేతనవుతుందని విమర్శించారు. దేశరక్షణ, సైనికులపై ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి గైర్హాజరు కావడం ఆయన దేశభక్తికి - మిగతా2లో



## దక్షిణాది మహిళకే బీజేపీ పగ్గాలు?

- జాతీయ అధ్యక్ష పదవి రేసులో నిర్మలా సీతారామన్, పురందేశ్వరి, వనతి శ్రీనివాసన్
- పార్టీ చరిత్రలో తొలిసారి మహిళా నేతకు అవకాశం
- మహిళకు బాధ్యతలు కట్టబెట్టేందుకు ఆర్ఎస్ఎస్ గ్రీన్‌సిగ్నల్

3



## నవ భారత్‌కు ఆకాశమూ హద్దు కాదు

- అభివృద్ధి ఫలాలు ఆపన్నులకు అందుతున్నాయ్: మోదీ
- ట్రినిడాడ్ అండ్ టొబాగోలో భారత సంతతి ప్రజలతో ఆత్మీయ భేటీ
- ప్రధానికి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం

## ప్రతి రూపాయికి ప్రతిఫలం రూ.2.54!



- ఇస్రోకు కేంద్రం కేటాయింపులపై మాజీ చీఫ్ సోమ్‌నాథ్
- బడ్జెట్ తక్కువే అయినప్పటికీ అద్భుతమైన సామర్థ్యం కలిగిన భారత అంతరిక్ష రంగం ప్రపంచ గుర్తింపు సాధించింది
- '2014కు పూర్వం ఈ రంగంలో దేశంలో ఒకే ఒక్క స్టార్టప్ కంపెనీ ఉండేది. ఇప్పుడవి 250కి పెరిగాయి.

3

## బొగ్గు, గనుల రంగాల్లో పర్యావరణహిత విధానాలు

**సుస్థిర మైనింగ్‌తో 100 కోట్ల టన్నులకు బొగ్గు ఉత్పత్తి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**సూర్య న్యూస్ హైదరాబాద్**

దేశంలో బొగ్గు, గనుల రంగాల్లో గత 11ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని.. సుస్థిర మైనింగ్, పర్యావరణహిత, పారదర్శక విధానాల ద్వారా కనీవినీ ఎరుగనిరీతిలో దేశీయ అవసరాల కోసం బొగ్గు ఉత్పత్తిని 100 కోట్ల టన్నులకు పెంచామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ హైటెక్‌సిటీలో 'పర్యావరణహిత, బాధ్యతాయుత మైనింగ్'పై అంతర్జాతీయ సదస్సు జరిగింది. కేంద్ర గనులశాఖ కార్యదర్శి బీఎల్ కాంతారావు, అదనపు కార్యదర్శి రూపీందర్ బ్రార్, బొగ్గు మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మారేపల్లి వెంకటేశ్వర్లు, కోల్ ఇండియా ఛైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. "వికసిత్ భారత్‌లో భాగంగా దేశంలోని వివిధ ఖనిజ - మిగతా2లో

# అల్లూరి వారసులను ఆదుకున్నాం

- ఫొటోలు అల్లూరి అనే ఫోల్డర్‌లో ఉంటాయి
- ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి పరిచయం చేశాం: రాజ్‌నాథ్ సింగ్
- మన ప్రజలను చంపినవాళ్లను మాత్రమే మనం చంపాం
- దేశ స్వాభిమాన చిహ్నం అల్లూరి సీతారామరాజు
- అల్లూరి 128వ జయంతి ఉత్సవాల్లో రక్షణ మంత్రి
- అమరులందరినీ గుర్తుచేసుకోవాలి: కేంద్ర మంత్రి షెకావత్



**సూర్య న్యూస్ హైదరాబాద్**

ఆపరేషన్ సిందూర్ ద్వారా ధైర్యం, ధర్మం, కర్మను ప్రపంచానికి పరిచయం చేశామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. పహల్గాంలో భారతీయులను చంపినవారినే ఆపరేషన్ సిందూర్ ద్వారా మనం చంపేశామని చెప్పారు. పహల్గాంలాంటి ఘటనలు మరోసారి జరిగితే సకాలంలో సరైన సమాధానం చెబుతామని హెచ్చరించారు. శుక్రవారం శిల్పకళావేదికలో స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అల్లూరి - మిగతా2లో




## తెలంగాణ తెచ్చుకుంది కడుక్కు తాగేందుకు కాదు

- కేసీఆర్‌తో సమావేశమైన కేటీఆర్, హరీశ్‌రావు, లింగయ్య ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, జగదీశ్‌రెడ్డి
- ఆస్పత్రిలో పార్టీ నేతలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- నాసిరకం పాలనతో రాష్ట్రానికి తీరని అన్యాయం
- సాగునీటి రంగంపై పాలకులకు తోక తెలియదు... మూతి తెలియదు
- నేనే ప్రెస్‌మీట్ పెట్టి బనకచర్ల సహా అన్ని విషయాలు వివరిస్తా

3

## 25 ఏళ్లుగా భూ సమస్యను పరిష్కరించరా?



- అధీకృత అధికారికి రూ.50 వేల జరిమానా విధించిన హైకోర్టు
- సైనిక సంక్షేమ నిధికి చెల్లించాలని ఆదేశం

2



లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్

## ముగ్గురితో పోరాడాం

3

- నేరుగా యుద్ధం చేసింది పాకిస్తానే కానీ.. హాని చేయాలని చూసింది చైనా
- తుర్కియేదీ కీలక పాత్రే.. 81 శాతం పాక్ సైనిక పరికరాలు డ్రాగన్‌వే
- 'ఆపరేషన్ సిందూర్'పై సైనిక ఉప ప్రధానాధికారి రాహుల్ ఆర్.సింగ్ కీలక వ్యాఖ్యలు

# యుద్ధాన్ని ఆపేశారేం?

-మొదటిపేజీ తరువాయి

నిదర్శనమని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, కార్యకర్తల సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

**మోదీ మణిపూర్ ఎందుకు వెళ్లలేదు?**

'గంభీరంగా కనిపిస్తున్నట్లు నటించే మోదీ నిజానికి అత్యంత భయస్తుడు. ప్రధాని మోదీ ఇప్పటివరకు 42 దేశాల్లో పర్యటించారు. కానీ స్వదేశంలో అగ్నిగుండంగా మారిన మణిపూర్‌కు మాత్రం వెళ్లలేదు. మణిపూర్ భారత్‌కు అత్యంత కీలకమైన ప్రదేశం. అక్కడ జరుగుతున్న ఆందోళనలను పరిశీలించేందుకు నేను, రాహుల్‌గాంధీ వెళ్లాం. బాధితులను పరామర్శించాం. మరి మోదీ ఎందుకు మణిపూర్ వెళ్లలేదు? వారు దేశ పౌరులు కాదా? దేశ ప్రజలను పట్టించుకోకుండా ప్రపంచ దేశాలు తిరుగుతూ దేశ ప్రజలను మోదీ రోడ్లపై వదిలేశారు. మోదీ మాదిరి అప్పట్లో ఇందిరాగాంధీ భయపడలేదు. బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కల్పిస్తామని చెప్పి చేసి చూపించారు..' అని ఖర్గే చెప్పారు.

**కాంగ్రెస్ సర్కారు వచ్చాకే అందరికీ అభివృద్ధి ఫలాలు**

'కార్యకర్తల కృషితోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చింది. కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి ఆత్మ. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నందున రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని చేసిన ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టారు. రాహుల్‌గాంధీ పాదయాత్ర సమయంలోనే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అర్థమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. కీలక రంగాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, రైతుభరోసా, రుణమాఫీ లాంటి ఎన్నో పథకాలు అమల్లోకి వచ్చాయి. ఇవన్నీ ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలి.

**రాజ్యాంగం నుంచి లౌకిక పదాన్ని తొలగించలేరు..**

హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థలు దాదాపు 50కి పైగా కాంగ్రెస్ పాలనలో ఏర్పడ్డాయి. మరి మోదీ ప్రభుత్వం హైదరాబాద్‌కు ఏమిచ్చిందో చెప్పాలి. నల్లధనం తెచ్చి ప్రతి వ్యక్తికి రూ.15 లక్షలు ఇస్తానన్న మోదీ ఆ తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు. మోదీ, అమిత్‌షా అబద్ధాలు చెప్పి ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలో లేదని బీజేపీ చెప్తోంది. కానీ రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసేయలేరు. సెక్యులర్ అనే పదంతో ఇబ్బందిగా ఉంటే బీజేపీ పార్టీ ప్రణాళిక నుంచి ఆ



పదం తొలగించి చూపించాలి..' అని ఖర్గే సవాల్ చేశారు.

**కాంగ్రెస్‌కు కార్యకర్తలే బ్రాండ్ అంబాసిడర్లు: సీఎం**

'తెలంగాణలో అధికార మదంతో తమకు తిరుగులేదనే అహంకారంతో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూలదోసి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ కార్యకర్తలకే దక్కుతుంది. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బ్రాండ్ అంబాసిడర్లు. కార్యకర్తల కృషితో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం..ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటైన 18 నెలల్లోనే రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, పేదలకు సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం. ఈ పథకాలు దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయి. తెలంగాణ మోడల్ దేశానికే ఆదర్శంగా మారుతోంది. ఈ పథకాలను కేంద్ర ప్రభుత్వం సైతం అమలు చేయాల్సిన పరిస్థితి వస్తోంది..' అని సీఎం రేవంత్ చెప్పారు.

**ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి**

'అద్భుతమైన పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నప్పటికీ వాటిని ప్రచారం చేసుకోవడంలో విఫలమవుతున్నాం. ప్రతి శాఖలో ఒక సంక్షేమ పథకం ఉంది. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉంది. ప్రజా ప్రభుత్వం ప్రతి హామీ అమలు చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికలప్పుడు కుల సర్వే హామీ ఇచ్చి అమలు చేసి చూపించాం. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దానిని జనగణనలో చేర్చింది. మహిళా సంఘాలకు ఆర్టీసీలో బస్సులు అద్దెకు ఇప్పించి లాభాలు గడించేలా ప్రోత్సహిస్తున్నాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్‌బంక్‌లు ఏర్పాటు చేయిస్తూ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నాం. కోటిమంది మహిళలను ఎస్‌హెచ్‌జీల్లో చేర్పించి కోటీశ్వరులుగా చేసే బాధ్యత ప్రభుత్వానిదే.

**మోదీ, కిషన్‌రెడ్డి, కేసీఆర్ చర్చకు రావాలి**

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. 18 నెలల్లో రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. వంద నియోజకవర్గాల్లో రూ.20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలను స్థాపించాం. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరించాలి. నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి. ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వదంటూ కొందరు వెకిలిగా వ్యాఖ్యానించారు. కానీ 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించాం. ఈ అంశంపై మోదీ, కిషన్‌రెడ్డి, కేసీఆర్ చర్చకు రావాలి. రైతులకు ఎవరు మేలు చేశారో అసెంబ్లీ సాక్షిగా చర్చిద్దాం..' అని ముఖ్యమంత్రి సవాల్ చేశారు.

**కార్యకర్తల ఎన్నికలొస్తున్నాయి..**

'రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయి. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ, 15 పార్లమెంటు స్థానాల్లో విజయం సాధించి అధిష్టానానికి బహుమతి ఇచ్చేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. స్టేజిమీద ఉన్న నాయకుల ఎన్నికలు అయ్యాయి. ఇప్పుడు కార్యకర్తల ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించే బాధ్యత కార్యకర్తలపైనే ఉంది. కార్యకర్తల గెలుపు కోసం పూర్తి సహకారం అందిస్తాం. టికెట్ల కోసం ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు. బీఫామే ఇంటికి వస్తుంది..' అని సీఎం అన్నారు. కాగా బహిరంగ సభ అనంతరం ఖర్గే బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు.

# తెలంగాణ తెచ్చుకుంది కడుక్కు తాగేందుకు కాదు

హైదరాబాద్

'సుదీర్ఘ కాలం కొట్లాడి తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నది కడుక్కుని తాగేందుకు, కరిగించుకుని తినేందుకు కాదు. రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం వెనుక ఉన్న గాఢతను అర్థం చేసుకునే తెలివితేటలు ప్రస్తుత పాలకులకు లేవు. రొడ్డకొట్టుడు ఉపన్యాసాలతో, నాసిరకం పాలనతో రాష్ట్రానికి తీరని నష్టం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి రంగంలో తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి ఎంత చెప్పినా తక్కువే. నీళ్ల కోసమే తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం పుట్టిందనే విషయం అందరికీ తెలుసు. కానీ ప్రస్తుత పాలకులకు సాగునీటి రంగంపై అవగాహన లేకపోవడంతో జరుగుతున్న నష్టంపై ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. ఒకటి రెండు రోజుల్లో నేను స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టి అన్ని విషయాలు ప్రజలకు వివరిస్తా'అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తన పార్టీ నేతలతో అన్నారు. వైద్య పరీక్షల కోసం సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చేరిన కేసీఆర్‌ను పలువురు పార్టీ నేతలు శుక్రవారం పరామర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లతో కేసీఆర్ ఇష్టాగోష్టి నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రైతులకు యూరియా ఎరువుల లభ్యత, వ్యవసాయం, సాగునీరు తదితర ప్రజా సమస్యలు, వర్తమాన అంశాలపై మూడు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ సాగు నీటి రంగంపై ప్రస్తుత పాలకులకు కనీస అవగాహన లేదు. వారికి తోక తెలియదు.. మూతి తెలియదు. బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టంపై నేనే స్వయంగా ఆదివారం (సూచనప్రాయంగా) మీడియాతో



మాట్లాడతా. నా ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేడు సాయంత్రం డిశ్చార్జి అయిన తర్వాత నందినగర్ నివాసంలోనే ఉంటా'అని కేసీఆర్ తెలిపారు.

**కేటీఆర్, హరీశ్‌రావుతో భేటీ**

నేతలతో ఇష్టాగోష్టి తర్వాత పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావుతో కేసీఆర్ సుదీర్ఘంగా భేటీ అయ్యారు. జాతీయ, రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలు, పార్టీ అంతర్గత అంశాలపై చర్చించినట్లు తెలిసింది. బనకచర్లపై తన ప్రెస్‌మీట్ తర్వాత పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, బండారు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, చిరుమర్తి లింగయ్య, శంకర్‌నాయక్, పార్టీ నేతలు వాసుదేవరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాకేశ్, నాగేశ్, సతీశ్‌రెడ్డి తదితరులు ఇష్టాగోష్టిలో పాల్గొన్నారు.

## జూరాల భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యం: జాన్‌వెస్లీ

అమరచింత

జూరాల ప్రాజెక్టు భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. వనపర్తి జిల్లా అమరచింత మండలం నందిమల్లలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును శుక్రవారం ఆయన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సీపీఎం నాయకులతో కలిసి సందర్శించారు. ప్రాజెక్టు ఈఈ జుబేర్ అహ్మద్‌తో కలిసి క్రషర్ గేట్ల వద్ద తెగిన ఇనుప తాళ్లను పరిశీలించారు. "గత ప్రభుత్వ విధానాల వల్ల ప్రాజెక్టుకు ముప్పు వాటిల్లింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూరాల ప్రాజెక్టును సందర్శించి అధికారులతో సమీక్షించాలి. కృష్ణానది జలాలు వృథా కాకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలి" అని వెస్లీ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం రూ.2,500 కోట్లు కేటాయించాలని కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరాంనాయక్, జబ్బార్, ఆంజనేయులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



## బొగ్గు, గనుల రంగాల్లో పర్యావరణహిత విధానాలు

-మొదటిపేజీ తరువాయి

పరిశ్రమలు తమ ఉత్పత్తులు పెంచాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పర్యావరణం, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా మైనింగ్ ప్రక్రియను నిర్వహించాలి. అవసరాలకు తగినంత బొగ్గు, అల్యూమినియం, రాగి తదితర ఖనిజాలను ఉత్పత్తిచేసి.. ఈ రంగాల్లో దేశాన్ని స్వయంసమృద్ధి దిశగా నడిపించాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉంది. గనులను ప్రారంభించడంతోపాటు అవి నడుస్తున్నప్పుడు, మూతపడినప్పుడు కూడా పర్యావరణానికి, ప్రజలకు నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలి. తమిళనాడులో కొన్ని గనులు ఈ విషయంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. మూసివేసిన గనులద్వారా స్థానికులకు తాగు, సాగునీరు అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించారు. కోల్, లైమ్‌స్టోన్, ఐరన్‌ఓర్ వంటి ఖనిజాల అన్వేషణ పూర్తయిన తర్వాత శాస్త్రీయ పద్ధతుల్లో గనులను మూసివేయాలి. కొన్నిచోట్ల మైనింగ్ పూర్తయిన భూముల్లో మత్స్యసంపదను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వపరంగా ఇప్పటివరకు 143 ప్రాజెక్టులను మైనింగ్ పూర్తయిన అనంతరం మూసివేశారు. వీటిని మైనింగ్ క్లోజర్ యాక్టివిటీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది" అని పేర్కొన్నారు. కేంద్ర గనులశాఖ కార్యదర్శి కాంతారావు మాట్లాడుతూ గనులను మూసివేసే క్రమంలో.. వాటిలో ఉపాధి కోల్పోయినవారికి కూడా మేలుచేసే విధానాలపై ఆలోచిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థ పర్యావరణహితమైన ఇన్‌పిట్ క్రషర్, డ్రాగ్‌లైన్, లాంగ్‌వాల్ వంటి మైనింగ్ సాంకేతికతలను అందిపుచ్చుకుంటోందని సీఎండీ బలరాం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సదస్సులో పర్యావరణ, ప్రజాహిత మైనింగ్ ప్రక్రియ విషయాలను వివరిస్తూ రూపొందించిన మిషన్ గ్రీన్, రిక్లెయిమ్ పుస్తకాలను ఆవిష్కరించారు. అన్వేషణ విభాగం కోసం సింగిల్‌విండో విధానాన్ని అమలుచేస్తూ రూపొందించిన పోర్టల్‌ను ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో బొగ్గు గనులను మూసివేసిన తర్వాత పచ్చదనం పెంపొందించిన వీడియోలను ప్రదర్శించారు. ప్రభుత్వ రంగ మైనింగ్ కంపెనీలు, అంతర్జాతీయ మైనింగ్ సంస్థల నుంచి 8 దేశాలకు చెందిన 300 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు.

## అల్లూరి వారసులను ఆదుకున్నాం

-మొదటిపేజీ తరువాయి

సీతారామరాజు తెలుగు ప్రజలతోపాటు మొత్తం భారతదేశ స్వాభిమానానికి చిహ్నంగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. అల్లూరి పోరాట యోధుడే కాదని, ప్రజల కోసం అన్నీ కోల్పోయిన గొప్ప నాయకుడన్నారు. దశాబ్దాలపాటు సాగిన పోరాటాలకు సీతారామరాజు బాటలు వేశారని అన్నారు.

**వేగంగా గిరిజనుల అభివృద్ధి**

ఆదివాసీలను సాధారణ జనజీవనంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. జాతి నిర్మాణంలో గిరిజనుల పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. వారి అభివృద్ధి కోసం అనేక పథకాలు చేపట్టామని, 50 వేలకుపైగా ఆదివాసీ గ్రూపులను ఏర్పాటు చేశామని వెల్లడించారు. నక్సల్స్ ఆ్యదీనంలోని ప్రాంతాల్లో ఇప్పుడు వేగంగా అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. ఆదివాసీలను పీడిస్తున్న నక్సలిజాన్ని తుడిచిపెట్టేస్తామని ప్రకటించారు. 'అల్లూరి కలను మేం నిజం చేయబోతున్నాం. రెన్యూవబుల్ ఎనర్జీ, వెదురు పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాం. ఏజెన్సీ ప్రాంతాల్లో 8 వేల సెల్ టవర్లు ప్రారంభిస్తాం. దానివల్ల టీవీ, ల్యాప్‌ట్యాప్, మొబైల్స్ వినియోగం పెరుగుతుంది'అని వివరించారు. అంతకు ముందు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ.. అల్లూరి జయంతి ఉత్సవాల్లో పాల్గొంటే హృదయం ఉప్పొంగుతోందని అన్నారు. క్షత్రియుడు ధైర్య సాహసాలతో తన మాతృభూమిని రక్షించుకోవడానికి ఎల్లప్పుడూ పోరాటానికి సిద్ధంగా ఉంటాడని పేర్కొన్నారు. మాతృభూమి కోసం ప్రాణ త్యాగం చేసిన యోధులందరినీ మనం గుర్తుంచుకోవాలని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అనేకమంది గిరిజన స్వాతంత్ర్య సమరయోధులకు చరిత్ర పుటల్లో స్థానం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అల్లూరి చరిత్ర తెలుసుకున్న ప్రధాని నరేంద్రమోదీ.. ఆ యోధుడి 125వ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్రధాని ఆదేశాలతో అల్లూరి జన్మించిన ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలో ఆయన జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. అప్పటికి సీతారామరాజు వారసులు చిన్న గుడిసెలో నివసించేవారని, వారందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చామని వెల్లడించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లాలో సీతారామరాజు స్నానమాచరించిన మంపకొలనును వర్చువల్‌గా మంత్రులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, కర్ణాటక చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.సుభాష్ చంద్రబోష్ , మాజీ కేంద్ర మంత్రి అశోక్‌గజపతి రాజు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు బీహెచ్ సత్యనారాయణరాజు, కార్యదర్శి రఘురామరాజు తదితరులు పాల్గొన్నారు.

## 25 ఏళ్లుగా భూ సమస్యను పరిష్కరించరా?



హైదరాబాద్

కాందిశీకుల భూములకు సంబంధించి వారసులు చేసుకున్న దరఖాస్తును 25 సంవత్సరాలైనా పరిష్కరించకపోవడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది. భూయజమాన్య హక్కుల వివాదం తరాలు మారుతున్నా పరిష్కారం కావడంలేదంది. హైకోర్టు ఆదేశాల మేరకు చేసుకున్న దరఖాస్తును కూడా పాతికేళ్లుగా పెండింగ్‌లో ఉంచిన అధీకృత అధికారి తీరుపై అసంతృప్తి వ్యక్తంచేసింది. మూడు నెలల్లో దరఖాస్తును పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రూ.50 వేలను సైనిక సంక్షేమ నిధికి చెల్లించాలని ఆదేశించింది. జనగామ పాత తాలూకాలోని కుందరం, బెక్కల్, సముద్రాల, జనగామ, మెట్టూరు, మాదూరు, సింగరాజపల్లి, బహిరిపల్లి, పఖాల్, పాలకుర్తి, ఇర్రెవేను, ముత్తారం, ఇప్పుగూడ, రఘునాథ్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఫాతిమా బేగం వారసులు సేల్ సర్టిఫికెట్ కోసం చేసిన దరఖాస్తును పరిష్కరించపోవడాన్ని సవాలు చేస్తూ అబుల్ ఖైర్ నసీరుద్దీన్ క్రమాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఈ భూములకు చెందిన వ్యక్తులు పాకిస్థాన్ వెళ్లిపోగా వాటిని కాందిశీకుల చట్టం కింద నియమితులైన అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు. అయితే, వారి సోదరి సలేహా ఫాతిమాబేగం ఇక్కడే ఉండి సంబంధిత భూములపై సేల్ సర్టిఫికెట్ పొందారు. ఈ భూములను 1962లో సేల్ సర్టిఫికెట్ జాబితా నుంచి తొలగించడంతో వారసులు హైకోర్టును ఆశ్రయించారు. అధీకృత అధికారికి దరఖాస్తు చేసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు వారసులు 2000లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుపై విచారణ తేలేదాకా భూములను మ్యుటేషన్ చేయరాదని తహశీల్దారును అధీకృత అధికారి ఆదేశించారు. కానీ, ముందడుగు పడలేదు. గత ఏడాది వారసులు మరోసారి వినతిపత్రం సమర్పించినా పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి దరఖాస్తును మూడు నెలల్లో పరిష్కరించాలని ఆదేశించారు.

# దక్షిణాది మహిళకే బీజేపీ పగ్గాలు?

న్యూఢిల్లీ

చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలనే సంకల్పానికి నిదర్శనంగా బీజేపీ చారిత్రక నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. పార్టీ చరిత్రలో తొలిసారి అధ్యక్ష బాధ్యతలు ఒక మహిళకు అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. బీజేపీ జాతీయ అధ్యక్ష పగ్గాలు ఈసారి దక్షిణాదికి చెందిన మహిళా నేతకే దక్కుతాయని ఢిల్లీలో ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ రేసులో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు ప్రముఖ మహిళా నేతలు ఉన్నారనే చర్చ జరుగుతోంది. వారిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. మరోవైపు.. మహిళకు పార్టీ పగ్గాలు కట్టబెట్టేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) కూడా ఆమోద ముద్ర వేసినట్లు సమాచారం. ఏడాదిన్నర కాలంగా జాతీయ అధ్యక్షుడి ఎంపికపై కొనసాగుతున్న ఉత్కంఠకు కొద్దిరోజుల్లో తెరదించేలా బీజేపీ అధిష్టానం కసరత్తు చేస్తోంది.

**ముందంజలో నిర్మలా సీతారామన్**

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) బీఎల్ సంతోష్ లను కలిశారు. కమలం పార్టీ అధ్యక్ష పీఠం కోసం జరుగుతున్న రేసులో ఆమె ముందువరుసలో ఉన్నారనే చర్చ మొదలైంది. సీనియర్ నేతగా, గతంలో రక్షణ మంత్రిగా పనిచేసిన అనుభం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఆమెకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే దక్షిణాదిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి, క్షేత్రస్థాయిలో పార్టీని విస్తరించేందుకు వీలవుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.



**రేసులో పురందేశ్వరి, వనతి శ్రీనివాసన్**

నిర్మలా సీతారామన్ తర్వాత.. కేంద్ర మాజీ మంత్రి, ఏపీ బీజేపీ మాజీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేరు వినిపిస్తోంది. ఆమెకు పలు భాషల్లో ప్రావీణ్యం ఉంది. రాజకీయాల్లో ఎంతో అనుభవజ్ఞురాలు. అలాగే బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ పేరు కూడా ప్రచారంలో ఉంది. తమిళనాడుకు చెందిన ఆమె వృత్తిరీత్యా న్యాయవాది. ప్రస్తుతం కోయంబత్తూర్ సౌత్ ఎమ్మెల్యేగా ఉన్నారు. గత ఎన్నికల్లో నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు కమల్ హాసన్‌పై విజయం సాధించారు. 1993లో బీజేపీలో చేరిన నాటినుంచి ఎన్నో కీలక పదవులు చేపట్టారు. 2020లో మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా, 2022లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఈ స్థానానికి చేరుకున్న మొదటి తమిళనాటు మహిళా నేత వనతి. కాగా.. ఢిల్లీలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్‌ల సమావేశాలు నిర్వహిస్తోంది. ఆర్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలె, బీజేపీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) బీఎల్ సంతోష్ లు పాల్గొంటున్నారు. ఈ సమావేశాల్లో బీజేపీ కొత్త అధ్యక్ష ఎంపికపై తుది నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం.

# టీవీకే సీఎం అభ్యర్థిగా నటుడు విజయ్

తమిళగ వెట్రి కళగం పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించింది. అలాగే ముఖ్యమంత్రి అభ్యర్థిని ఖరారు చేసింది. పార్టీ అధినేత, ప్రముఖ నటుడు విజయ్ పేరును శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. శుక్రవారం ఉదయం చెన్నైలోని పార్టీ ప్రధానకార్యాలయంలో విజయ్ అధ్యక్షతన టీవీకే పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో విజయ్‌ను సీఎం అభ్యర్థిగా ఎన్నుకుంది టీవీకే కార్యవర్గం. అలాగే.. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించింది. అంతేకాదు పలు కీలక తీర్మానాలను ఆమోదించారు.

"బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోంది. ఆ పార్టీ విష రాజకీయాలు తమిళనాడులో చెల్లవు. ఈ ఎన్నికల్లో వేర్పాటువాదులతో పొత్తు ఉండదు"

:::విజయ్

వచ్చే నెలలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని, అటుపై ఎన్నికల దాకా గ్రామగ్రామాన బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. విజయ్‌ను ప్రజలకు మరింత దగ్గరగా తీసుకెళ్లేందుకు అవసరమయ్యే కార్యాచరణను సిద్ధం చేయడానికి, దానిని అమలు చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని టీవీకే భావిస్తోంది.




అంతేకాదు.. తాజాగా అమిత్ షా చేసిన ఆంగ్ల భాష కామెంట్లు.. తమిళనాడుపై నేరుగా చేసిన దాడిగా టీవీకే పేర్కొంటూ ఖండించింది. బలవంతంగా హిందీని, సంస్కృత భాషను తమిళనాడులో ప్రవేశపెట్టే ప్రయత్నాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని తీర్మానంలో టీవీకే స్పష్టం చేసింది. అలాగే.. ఎలక్టోరల్ రివిజన్ చేపట్టాలన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాన్ని టీవీకే తప్పుబట్టింది. ఇది బీజేపీకి అనుకూలంగా జరుగుతున్న ప్రయత్నమేనని, రాష్ట్రంలో మైనారిటీల ఓట్లను తగ్గించే ప్రయత్నమేనని ఆరోపించింది. భారత సినీ పరిశ్రమలో అగ్రహీరోగా కొనసాగుతున్న విజయ్ రాజకీయ రంగ ప్రవేశం గురించి తమిళనాట మాత్రమే కాదు.. యావత్ దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అనూహ్యంగా.. 2024 ఫిబ్రవరి 2వ తేదీన సెక్యులర్ సోషియల్ జస్టిస్ అనే సిద్ధాంతంతో తమిళగ వెట్రి కళగం పార్టీని విజయ్ ప్రకటించారు. అదే ఏడాది అక్టోబర్ 27న విల్లుపురం జిల్లా విక్రవండిలో తొలి రాజకీయ మహాసభ నిర్వహించగా.. అది సూపర్ సక్సెస్ అయ్యింది. ఆ మహాసభ వేదికగా.. తన పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలు ప్రకటించారాయాన. పెరియార్, అంబేద్కర్, కామరాజ్, వేలు నాచియార్ తదితరుల ఆశయాలపై నడుస్తానని స్పష్టం చేశారు. అప్పటి నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. నీట్, జాతీయ నూతన విద్యా విధానం.. త్రిభాషా సిద్ధాంతం అమలు లాంటి అంశాలతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న అఘాయిత్యాలపై స్పందిస్తూ రాజకీయంగానూ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు.

# అమెరికా విషయంలో ఆచితూచి అడుగులు

**న్యూఢిల్లీ :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500% పన్నులు విధిస్తామన్న అమెరికా బెదిరింపులపై కేంద్ర మంత్ర జై శంకర్ స్పందించారు. ఈ అంశం భారత్ ప్రయోజనాలపై ప్రభావం చూపుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన భద్రత విషయంలో భారత్ తన నిర్ణయం తీసుకుంటుందని, అమెరికా చర్యలను గమనిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడంపై అమెరికా ఆంక్షలు విధిస్తే భారత్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.ఆంక్షలు కొనసాగుతున్నా రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తామనే అమెరికా బెదిరింపులపై భారత విదేశాంగా శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. వాషింగ్టన్ డీసీలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తున్న దేశాలపై అమెరికా విధించబోయే 500 శాతం దిగుమతి సుంకాలపై ఆందోళనలను వ్యక్తం చేశారు. అమెరికా కాంగ్రెస్ సభ్యుడు లిండ్సే గ్రాహమ్ ప్రవేశపెట్టిన కొత్త బిల్లును దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించిన బిల్లు అమెరికా కాంగ్రెస్ చర్య అయితే అది భారత ప్రయోజనాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున మేం దానిని గమనించాల్సిందే" అని జైశంకర్ పేర్కొన్నారు.ఇంధన భద్రతల విషయంలో భారత్‌కు ఉన్న ప్రయోజనాలను మేము ఆయనకు (గ్రాహమ్) స్పష్టంగా వివరించాం... ఈ సమస్య ఎదురైనప్పుడు తగిన విధంగా స్పందిస్తాం" అని ఆయన అన్నారు. అమెరికా రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ఇటీవల ఏబీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ:. "రష్యా నుంచి ఉత్పత్తులు కొంటూ ఉక్రెయిన్‌కు సహాయం చేయకుంటే అప్పుడు మీ ఉత్పత్తులపై 500 శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తాం" అని చెప్పారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ బిల్లును ఆమోదించినట్లు గ్రాహమ్ వెల్లడించారు. ఈ బిల్లుకు ఇప్పటికే 84 మంది సెనేటర్లు సంతకం చేశారు.



భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగుతున్న వేళ ట్రంప్ బెదిరింపులకు దిగారు.ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలైన తర్వాత.. ఆ దేశంపై అమెరికా, పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో రష్యా చమురుకు డిమాండ్ తగ్గిపోవడంతో తక్కువ ధరకే విక్రయించడానికి రష్యా ముందుకొచ్చింది. ఈ చమురును రాయితీపై భారత్ దిగుమతి చేసుకుంటోంది. మే 2025 నాటికి, రోజుకి 1.96 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును భారత్ దిగుమతి చేసుకుంది. ఈ మార్పుతో రష్యా చమురు, భారత మొత్తం ముడి చమురు దిగుమతుల్లో 1 శాతం నుంచి 44 శాతానికి పెరిగింది. ఇది అమెరికాకు అత్యంత ఆందోళనకర విషయం కావచ్చు.కాగా, దీనిపై విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందిస్తూ.. "భారత్-అమెరికా సంబంధాల విషయంలో మేమే నిర్ణయం తీసుకుంటాం.. పాకిస్థాన్ కాదు" అని పేర్కొంటూ ఇటీవల భారత్ పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాగా, ఈ బిల్లు అమెరికా పార్లమెంటులో మ దారి తీసే అవకాశమున్నా, భారత్ మాత్రం తన జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రతల విషయంలో స్పష్టమైన దృక్కోణాన్ని చూపించింది. అమెరికా సరైన దౌత్యపరమైన మార్గాన్ని ఎంచుకుంటుందా? లేక వాణిజ్య యుద్ధానికి దిగుతుందా? అనేది త్వరలో తేలనుంది.

## కాంగ్రెస్ తీరు ఇప్పటికైనా మారాలి

**ఢిల్లీ:** భారత్‌లో మైనార్టీలు అనుభవిస్తున్న వసతులు ప్రపంచంలో ఏ దేశ ప్రజలూ అనుభవించట్లేదని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. గత 75 ఏళ్లుగా ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఓ ఓటు బ్యాంకుగా చూస్తోందని విమర్శించారు. దీనివల్ల వారికి నష్టం చేకూరుతోందని.. కాంగ్రెస్‌కు మాత్రమే లబ్ధి కలుగుతోందని అన్నారు. శుక్రవారం ఆయన హజ్ యాత్రపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. మైనార్టీల్లో చాలా మంది ఇప్పటికీ పేదవారిగానే ఉండిపోవడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని మండిపడ్డారు. దీనికి స్వస్తి పలకాల్సిన అవసరముందని, ఇప్పటికైనా కాంగ్రెస్ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. మరోవైపు బిహార్ ఎన్నికలపైనా రిజిజు స్పందించారు. ఏఐఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ ఇటీవల ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు లేఖ రాసిన సంగతి తెలిసిందే. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఎంఐఎంను మహాఘట్‌బం ధన్‌లో చేర్చుకోవాలని ఆ లేఖ సారాంశం. దీనిపై రిజిజు మాట్లాడుతూ.. " మేం లౌకికవాదులం.

## కేరళలో మళ్లీ నిపా వైరస్ కలకలం..

## మూడు జిల్లాల్లో అలెర్ట్

**తిరువనంతపురం:** కేరళలో మళ్లీ నిపా వైరస్ కలకలం రేపుతున్నది. ఇద్దరు వ్యక్తుల్లో నిపా వైరస్ లక్షణాలు గుర్తించారు. దీంతో ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమ య్యారు. మూడు జిల్లాల్లో అలెర్ట్ ప్రకటించారు. కోజికోడ్, మలప్పురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించగా రెండు అనుమానిత నిపా కేసులు వెలుగులోకి వచ్చాయి. మలప్పురం, పాలక్కాడ్ జిల్లాలకు చెందిన వ్యక్తుల నమూనాలను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. కాగా, కేరళలో మరోసారి నిపా వైరస్ వ్యాప్తిపై ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. కోజికోడ్, మలప్పురం, పాలక్కాడ్ జిల్లాల్లో ఆరోగ్యపరంగా హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. కాంటాక్ట్ ట్రేసింగ్, రోగ లక్షణాల గుర్తింపుతోపాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ప్రాంతంలో 26 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

## నవ భారత్‌కు ఆకాశమూ హద్దు కాదు

పోర్ట్ ఆఫ్ స్పెయిన్

ప్రపంచంలోకెల్లా మూడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ త్వరలోనే అవతరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమాగా చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో చేపడుతున్న మిషన్లు దేశానికి కొత్త వృద్ధి ఇంజిన్లుగా మారుతున్నాయని పేర్కొన్నారు. నవ భారత్ ప్రగతికి ఆకాశం కూడా హద్దు కాదని వ్యాఖ్యానించారు. కరీబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోలో తాజాగా పర్యటించిన మోదీ.. ఆ దేశంలోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమావేశంలో ప్రసంగించారు. భారత్‌ను అవకాశాల గనిగా అభివర్ణించారు. దేశాభివృద్ధి ఫలాలు ప్రస్తుతం ఆపన్నులకు అందుతున్నాయని పేర్కొన్నారు. ట్రినిడాడ్ అండ్ టొబాగోలోని భారత సంతతి వ్యక్తులపై ప్రశంసల వర్షం కురిపించారు. వారంతా భారత నేలను విడిచిపెట్టారే తప్ప ఆత్మను వదల్లేదని అన్నారు. గంగా, యమునలను వదిలివచ్చినా.. రామాయణాన్ని మాత్రం తమ గుండెల్లోనే దాచుకున్నారని పేర్కొన్నారు. వారు కేవలం వలసదారులు కాదని, సనాతన నాగరికతకు దూతలని వ్యాఖ్యానించారు. వారి సేవలు ట్రినిడాడ్ అండ్ టొబాగోకు సాంస్కృతికంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా లబ్ధి చేకూర్చాయన్నారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో పార్లమెంటు సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి కూడా మోదీ ప్రసంగించారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువని పేర్కొన్నారు. దానికి ఆశ్రయ నిరాకరణలో అంతర్జాతీయ సమాజం ఒక్కటిగా నిలవాలన్నారు. మరోవైపు- తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో'ను ఆ దేశ అధ్యక్షురాలు క్రిస్టైన్ కర్లా కంగలూ ప్రధాని మోదీకి ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని దక్కించుకున్న తొలి విదేశీ నేత మోదీయే కావడం విశేషం. ఆయన అందుకున్న 25వ అంతర్జాతీయ అవార్డు ఇది. సృజనాత్మక, శక్తిమంతమైన యువత సహాయంతో దేశం వేగంగా పురోగమిస్తోందని భారత సంతతి ప్రజలతో సమావేశంలో మోదీ పేర్కొన్నారు. యూపీఐ చెల్లింపుల విధానాన్ని అమలు చేస్తున్నందుకు ట్రినిడాడ్ అండ్ టొబాగోను మోదీ అభినందించారు. వెస్టిండీస్ క్రికెటర్ల బౌలింగ్ కంటే వేగంగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయంటూ చమత్కరించారు.

## ప్రతి రూపాయికి ప్రతిఫలం రూ.2.54..!




న్యూఢిల్లీ

దేశ అంతరిక్ష కార్యక్రమం ప్రభుత్వానికి మంచి ఆదాయం తెచ్చిపెడుతోందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మాజీ చైర్మన్ ఎస్.సోమ్‌నాథ్ చెప్పారు. ఇస్రోలో పెట్టే ప్రతి రూపాయిపై రూ.2.54 మేర ఆదాయం వస్తోందని వెల్లడించారు. శుక్రవారం ఆయన 'ఆక్స్‌ఫర్డ్ ఇండియా బిజినెస్ ఫోరం'లో ప్రసంగించారు. బడ్జెట్ తక్కువే అయినప్పటికీ అద్భుతమైన సామర్థ్యం కలిగిన భారత అంతరిక్ష రంగం ప్రపంచ గుర్తింపు సాధించిందని ఆయన వివరించారు. 'మేం ఖర్చు చేసే ప్రతి రూపాయికి అందుతున్న ప్రతిఫలం రూ.2.54. బడ్జెట్‌లో పెద్దగా కేటాయింపులు లేకున్నా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుని, ఉపగ్రహాలను నిర్మించి విజయవంతంగా ప్రయోగించాం'అని తన హయాంలో అనుభవాన్ని ఆయన తెలిపారు. చంద్రయాన్-3 లూనార్ ల్యాండింగ్, ఆదిత్య ఎల్-1 మిషన్ వంటి ఇస్రో సాధించిన మైలురాళ్లు అంతరిక్ష అన్వేషణలో భారత్ సత్తాకు నిదర్శనాలని చెప్పారు.

**ప్రైవేట్ రంగం గణనీయ వృద్ధి**

ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ గణనీయంగా అభివృద్ధి సాధించిందని సోమ్‌నాథ్ చెప్పారు. '2014కు పూర్వం ఈ రంగంలో దేశంలో ఒకే ఒక్క స్టార్టప్ కంపెనీ ఉండేది. ఇప్పుడవి 250కి పెరిగాయి. ఉపగ్రహాలు, రాకెట్లను నిర్మించడంతో పాటు కక్ష్యలోకి ప్రవేశపెట్టే దిశగా ముందుకు సాగుతున్నాయి. ఈ రంగంలో అనుబంధ కంపెనీలు కూడా పెరుగుతున్నాయి. ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారత్ తన వాటాను పెంచుకునేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతోంది'అని సోమ్‌నాథ్ తెలిపారు. వచ్చే 25 ఏళ్లలో భారతీయుడిని చంద్రుడిపైకి పంపి, అక్కడ ల్యాండ్ చేయించడంతోపాటు తిరిగి తీసుకువచ్చే బృహత్తర ప్రణాళిక ఇస్రో వద్ద ఉందన్నారు. ఇందులో పునర్వినియోగ రాకెట్ల నిర్మాణం, భారతీయ అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, అంతరిక్షంలోకి భారతీయులను పంపడం, చంద్రుడితోపాటు గురుగ్రహంపైకి అన్వేషణలను చేపట్టడం వంటివి కూడా ఉన్నాయని వివరించారు.

**ఇతర దేశాలకు సైతం సాయం**

నేపాల్, భూటాన్, ఒమన్, దక్షిణాఫ్రికాతోపాటు ఆసియాన్ దేశాల అంతరిక్ష అన్వేషణ సామర్థ్యాలను ప్రోత్సహించేందుకు, పెంచేందుకు భారత్ కృషి చేస్తోందన్నారు. పునర్వినియోగ ప్రయోగ వాహనాలను అభివృద్ధి చేయడం, పరిశోధన%-%అభివృద్ధి వ్యయాన్ని పెంచడం, వ్యూహాత్మక అంతరిక్ష రంగంలో మరింత పెట్టుబడి పెట్టవలసిన అవసరం ఎంతో ఉందన్నారు. అంతరిక్ష శాస్త్రం, సాంకేతికతలో భారత్‌ను అగ్ర స్థానానికి తీసుకెళ్లాలన్నదే ఇస్రో లక్ష్యమని సోమ్‌నాథ్ చెప్పారు.

## ముగ్గురితో పోరాడాం

ఢిల్లీ

'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్‌ను దెబ్బతీయడానికి పాకిస్థాన్‌ను చైనా పూర్తిగా వినియోగించుకుందని సైనిక ఉప ప్రధానాధికారి లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్.సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) నిర్వహించిన 'న్యూ ఏజ్ మిలిటరీ టెక్నాలజీస్' సదస్సులో ఆయన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో నెలకొన్న పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యంగా చైనా పాత్రను తీవ్రంగా విమర్శించారు. భారత్-పాక్ ఘర్షణను బీజింగ్ తన ఆయుధ వ్యవస్థలను పరీక్షించుకోవడానికి ఓ ప్రయోగశాలగా వాడుకుందని అన్నారు. భారత్‌కు హాని చేసేందుకు పాకిస్థాన్‌కు అవసరమైన సహాయ సహకారాలను చైనా అందచేసిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ నుంచి భారత్ నేర్చుకోవాల్సిన పాఠాలు కూడా ఉన్నాయని తెలిపారు. "మనకు సరిహద్దు ఒకటే. శత్రువులిద్దరు. వాస్తవంగా చూస్తే ముగ్గురు. ఎదురుగా పాకిస్థాన్ ఉంది. ఆ దేశానికి చైనా పూర్తి సహకారం అందించింది. పాకిస్థాన్ దగ్గర ఉన్న 81 శాతం సైనిక పరికరాలు బీజింగ్‌వే. తన ఆయుధాలను చైనా ఈ ఘర్షణలో పరీక్షించుకుంది. తుర్కియే కూడా కీలక పాత్ర పోషించింది. డీజీఎంవో స్థాయి చర్చలు జరిగినపుడు మనకు సంబంధించిన ముఖ్యమైన నిఘా సమాచారాన్ని ఎప్పటికప్పుడు పాకిస్థాన్‌కు చైనా అందించింది. మనకు పటిష్ఠమైన గగనతల రక్షణ వ్యవస్థ అవసరం ఎంతైనా ఉంది" అని రాహుల్ సింగ్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయని, పక్కా డేటా ఆధారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లక్ష్యాలను ఎంపిక చేసుకున్నామని చెప్పారు.

# సేవానిరతికి ప్రతిరూపం కంచర్ల సుగుణమణి

భారతదేశ చరిత్రలో మహిళా నేతలు పోషించిన పాత్ర విశిష్టమైనది. సంఘ సేవ చేసేవారు ఎంతో మంది ఉండవచ్చు. కాని సంఘ సేవే పరమావధి గా తమ జీవితాలను అంకితం చేసే వారు బహు అరుదుగా వుంటారు. ఆలాంటి త్యాగ మూర్తులలో అగ్ర భాగాన నిలుస్తారు కంచర్ల సుగుణమణి. ఆమె ప్రముఖ సంఘ సేవకురాలు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ కు అసలు సిసలైన అనుచరురాలిగా ఆమె సుప్రసిద్ధురాలు. ఆమె 1919, నవంబర్ 27వ తేదీన కాకినాడలో గురుజు వెంకటస్వామి, సూర్యనారాయణమ్మ దంపతులకు జన్మించారు. ఆ రోజులలోనే ఈమె మగపిల్లలతో సమానంగా మహారాజా కాలేజీలో డిగ్రీ చదివారు. చిన్నప్పటినుండి మంచి వాతావరణంలో పెరగడంవల్ల ఆమెకు సేవాభావం అలవడింది. ఆమె వివాహం గాంధేయవాది కంచర్ల భూషణంతో జరిగింది. ఆ రోజుల్లోనే కట్నకానుకలు వద్దని, చదువు, సంస్కారం వున్న అమ్మాయి కావాలని కంచర్ల భూషణం ఆమెను వివాహం చేసుకున్నారు. ఆమె చదువుకునే రోజులలోనే భూకంపాలు, వరదలు, ఉప్పెనలు వచ్చినప్పుడు, ఇంటింటికీ వెళ్ళి విరాళాలు సేకరించి కాలేజీ యాజమాన్యానికి అప్పగించారు. తనలోని తపనను అక్షరాలతో పొదిగి గృహలక్ష్మి, భారతి వంటి పత్రికలకు వ్యాసాలు వ్రాసింది. స్త్రీ జనోద్ధరణ కోసం 1937లో లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే సంస్థ ప్రారంభించారు. భర్త ఉద్యోగరీత్యా ఈమె ఢిల్లీ వెళ్ళారు. ఆకాశవాణిలో ఆమె తొలి తెలుగు ప్రసంగం ఢిల్లీ నుండి ప్రసారమయింది. 1944 సంవత్సరంలో భర్తకు బదిలీ కావడంతో మద్రాసుకు మకాం మార్చారు. భర్త ప్రోత్సాహంతో, ఆమె దుర్గాబాయమ్మను సందర్శించి ఆమెతో పాటుగా సేవ చెయ్యాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. దుర్గాబాయమ్మ దానికంగీకరించి ఆమెకు "ఆంధ్రమహిళ" పత్రిక పూర్తి బాధ్యతను అప్పగించింది. మద్రాసులో ఆమెకు బులుసు సాంబమూర్తి, భోగరాజు పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు మొదలైన ప్రముఖుల సాంగత్యంతో ఆమె ఎన్నో విషయాలు తెలుసు కోగలిగారు. దుర్గాబాయమ్మ గారితో కలిసి "కస్తూరిబా నిధి"కి విరాళాలు ఒక సంవత్సరంలో 6 లక్షలు ప్రోగు చేశారు. ఆ రోజుల్లో 6 లక్షలంటే సామాన్యం కాదు. మహాత్మాగాంధి ఆజ్ఞ ప్రకారం దుర్గాబాయమ్మతో కలసి ఆ నిధితో ఆమె రాష్ట్రమంతా పర్యటించి, "కస్తూరిబా సేవా సంఘాలు" స్థాపించి అనుభవజ్ఞులైన సేవికలను ఏర్పాటు చేశారు. ఈనాటికీ అవి నిర్విరామంగా సేవలు చేస్తున్నాయంటే వాటి వెనుక ఆమె కృషి ఎంతో ఉంది. భర్త ఉద్యోగరీత్యా అరకు వెళ్ళినప్పుడు అక్కడి గిరిజనుల పూరిళ్ళు, ఆహారం, భాష, కట్టుబాట్లు విచిత్రంగా వుండటం ఆమె గమనించారు. అక్కడి అనారోగ్యాలూ, విష జ్వరాలూ, కొండదేవతలకిచ్చే నరబలులు, జంతు బలులూ చూసి చలించి పోయి, మద్రాసులోని స్త్రీ శిశు సంక్షేమ అధికారి పారిజాతం నాయుడికి లేఖ రాశారు. ఆమె సహకారంతో ఒక సంక్షేమ కేంద్రాన్ని స్థాపించి, తమ కాలనీలోని స్త్రీల సహకారంతో పిల్లలకు చదువు, ఆటపాటలు, కుట్లు, పారిశుధ్యం నేర్పుతూ సుగుణమణి ఐదు సంవత్సరాలు వారికి సేవ చేశారు. ఇప్పటికీ అక్కడ ఆ కేంద్రంలో స్త్రీలకు,



పిల్లలకు చదువు, వృత్తివిద్యలు, ఆరోగ్య సూత్రాలు నేర్పుతున్నారు. 1944 నుంచీ ఆలిండియా రేడియోలోనూ, టి.వి. వచ్చిన తరువాత అన్ని ఛానల్స్‌లోను ఎన్నో స్త్రీల సమస్యల గురించి తన నిశ్చితాభిప్రాయాలను వెలిబుచ్చుతూనే ఉండేవారు. శిశువుల నుంచీ వృద్ధుల దాకా స్త్రీలను ఆదుకోవాలనే ఆశయంతో సుందర్ నగర్‌లో వృద్ధాశ్రమం ఏర్పాటు చేశారు. ఆమె దుర్గాబాయమ్మ కోరిక మేరకు 1957 అక్టోబరులో హైదరాబాదు వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. "ఆంధ్ర మహిళాసభ" హైదరాబాద్ శాఖను అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. అప్పుడు విద్యానగర్‌లో ప్రారంభించిన "ఆంధ్ర మహిళాసభ" మెటర్నిటీ హాస్పిటల్, హేండీక్రాఫ్ట్స్ ఇన్‌స్టిట్యూట్, హైస్కూల్, హాస్టల్, అసెంబ్లీహాల్ లతో నిండిపోతే, ఉస్మానియా యూనివర్సిటీలో కూడా స్థలం తీసుకుని ఆర్ట్స్, సైన్స్, లా కాలేజీలు, కంప్యూటర్ కోర్స్, సంగీతం క్లాసులు, లిటరసీ భవన్, గాంధీభవన్, హాస్టల్, వికలాంగుల స్కూలు, ఫిజియోథెరపీ, నర్సింగు హాస్టల్ అలా ఎన్నో ఏర్పాటు చేశారు. 260 మంది పిల్లలు ఎన్నో వృత్తి విద్యలు నేర్చుకుంటున్నారు. "ఆంధ్ర మహిళాసభ" పెట్టిన కొత్తలో దుర్గాబాయమ్మతో కలిసి ఆమె ఇంటింటికీ తిరిగి బేడా, పావలా కూడా విరాళాలుగా సేకరించింది. అలా మొదలైన సేవ మరణించే వరకూ లక్షలలో విరాళాలు సేకరిస్తూ "ఆంధ్రమహిళాసభ"ను శాఖోప శాఖలుగా విస్తరిస్తూ, కొన్ని శాఖలకు కార్యదర్శిగా, సలహాదారుగా సేవలు చేస్తూ, 6 ఏళ్ళు అధ్యక్షురాలిగా సమర్ధ వంతంగా ఆ పదవిని నిర్వహించారు. దుర్గాబాయమ్మ మరణించాక 'ఆంధ్ర మహిళాసభ' పూర్తి బాధ్యతలను చేపట్టారు. ట్రస్ట్ బోర్డ్‌కి మరణించే వరకు తన సహాయ సహకారాలను అందించారు. ఆమె ఆధ్వర్యంలో దుర్గాబాయమ్మ సెంటినరీ సెలబ్రేషన్స్ చాలా ఘనంగా జరిగింది. మద్రాసు, హైదరాబాద్‌ల లోనే కాకుండా, కర్నూలు, సంగారెడ్డి, మహబూబ్ నగర్, ఇబ్రహీంపట్నం లలో కూడా ఆంధ్ర మహిళాసభ ఎంతో కృషి చేస్తున్నది. ఎడల్ట్ ఎడ్యుకేషన్ రూరల్ ఏరియాలలో లిటరసీ హౌస్ దక్షిణ భారతంలో "ఆంధ్ర మహిళాసభ"లో మాత్రమే వున్నది. వాలంటరీ సెక్టార్‌లో కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ ఇచ్చే మొదటి సంస్థ యిదే. ఇన్ని సంస్థలు దుర్గాబాయమ్మ తదనంతరం కూడా అంత ఘనంగానూ నడుస్తున్నా యంటే, అది ఆమె ఓర్పు, నేర్పు, సహనం, సమయపాలనల వల్లనే. "ఆంధ్ర మహిళ" పత్రిక పూర్తి బాధ్యత సుగుణమణి తీసుకున్నారు. అందులో కనుపర్తి వరలక్ష్మమ్మ, ఆచంట రుక్మిణమ్మ, కాంచనపల్లి కనకాంబ మొదలైన ఆనాటి ప్రముఖ రచయిత్రుల వ్యాసాలను ప్రచురించటమే కాదు, తనూ స్వయంగా వ్రాసి పత్రికను తీర్చిదిద్దారు. ప్రూఫులు దిద్దటం దగ్గరనుంచీ, స్టాంపులు అంటించి నడిచివెళ్ళి పోస్ట్ చెయ్యటం దాకా అన్ని బాధ్యతలూ ఈమే నిర్వర్తించే వారు. అటు 'ఆంధ్ర మహిళాసభ'లో స్త్రీ సంక్షేమంతో పాటుగా, యిటు 'బాలానంద సంఘం'లో శిశుబాలల సంక్షేమానికీ ఆమె అంకితమైనారు. 'బాలానంద సంఘం'లో మొదటి నుంచే ఉపాధ్యక్షురాలిగా ఆమె ఎంతో సేవ చేశారు. రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావు, అక్కయ్య న్యాయపతి కామేశ్వరి దంపతులకు ఆమె ఎంతో ఆత్మీయురాలు. న్యాయపతి రాఘవరావు చనిపోయి తరువాత 1984 నుండి ఆమె బాలానంద సంఘం అధ్యక్షురాలిగా పనిచేసింది. ఆమె ఆధ్వర్యంలో "ఆంధ్ర బాలానంద సంఘం" 1990 సంవత్స రంలో స్వర్ణోత్సవాలను దిగ్విజయంగా జరుపుకున్నది. ప్రజా జీవితంలో ఎన్నో పదవులు ఆమెను వరించాయి. ఆంధ్ర మహిళా సభ కార్యదర్శి/సలహాదారు/ అధ్యక్షురా లుగా, ఆంధ్ర బాలానంద సంఘం ఉపాధ్యక్షురాలు/ అధ్యక్షురా లుగా, మద్రాస్ రాష్ట్ర సొసైటీ అడ్వయిజరీ బోర్డు సభ్యురాలుగా, వికలాంగుల సలహాబోర్డు సభ్యురాలుగా, కస్తూర్బా గాంధీ సేవాసంఘం ఉమెన్ కమిటీ కార్యదర్శిగా, శారదా సంఘం ఆంధ్రప్రదేశ్ ఛైర్‌పర్సన్ గా, ఉమ్మడి ఏపీ కార్మిక సంక్షేమ సలహా కమిటీ సభ్యురాలుగా వివిధ పదవులు చేపట్టి సేవలు అందించారు. 1991లో: ఛైల్డ్ వెల్ఫేర్‌కి గాను నేషనల్ అవార్డు అప్పటి ప్రెసిడెంట్ చేతుల మీదుగా, 1991లో శిరోమణి ఇన్‌స్టిట్యూట్, న్యూఢిల్లీ వారి చేత వికాసశ్రీ అవార్డు 1993 లో భరతముని కళా అవార్డు, 1994లో రాజీవ్‌రత్న నేషనల్ అవార్డు, 2000లో మిలీనియమ్ అవార్డు, 200లో రామకృష్ణ మఠ్ ద్వారా లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు, 2001లో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా హైదరాబాద్ పెరల్ సిటీ జూనియర్ ఛాంబర్ వారిచె హైదరాబాద్ పెరల్ అవార్డు, 2002లో గాంధీగారి మనుమరాలు, తారాగాంధీ చటర్జీ ద్వారా సర్వోదయా సంస్థ అవార్డు, 2005లో రామినేని ఫౌండేషన్ విశేష పురస్కారం, కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తమ సంఘసేవకురాలు పురస్కారం, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అవార్డు, ఇందిరా ప్రియదర్శిని ప్రతిభా అవార్డు తదితర పురస్కారాలు, సన్మానాలు పొందారు. ఆమె తన 99వ యేట 2017, జూలై 5వ తేదీ బుధవారం హైదరాబాదులో మరణించారు.

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి

ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్‌నాయక్ పౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు. రావూరి భరద్వాజ (జూలై 5, 1927 – (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చుకున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపాడు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింపబడుతుంది. ఈయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువుకున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్నతనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించుకున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు. రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపం లోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం



ఎక్కువగా ఉండేది. యుక్త వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు. 1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు. రావూరి భరధ్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరధ్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకలనాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించుకు న్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్స హించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపా ధికై ఆయన అనేక కథలు వ్రాశారు. 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాదమైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు. విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలి సరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది. రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారా వాహికగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ – ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుక తెర వెనకకు లభించింది. 1987లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యలో విశిష్ట పురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4 వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.

# సహకారం సమాజ అభివృద్ధికి మార్గం

ప్రపంచం నేడు అనేక సంఘర్షణల మధ్య సామాజిక సమగ్రత కోల్పోతున్న తరుణంలో, సమానత్వాన్ని, సమిష్టి ప్రయోజనాన్ని, సమాజ సంక్షేమాన్ని ప్రాతినిధ్యం వహించే వ్యవస్థ సహకార మొక దారి చూపుతుంది. ప్రతి సంవత్సరం జూలై మొదటి శనివారం రోజున ప్రపంచ మంతటా అంతర్జాతీయ సహకార దినోత్సవం జరుపుకుంటారు. ఈ సంవత్సరం, 2025లో, జూలై 5న ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతోంది. ఇది కేవలం ఒక ఉత్సవం కాదు%ౕ% సహకార భావనను మరింత విస్తరించేందుకు, సామాజిక భద్రతకు, ఆర్థిక సమానత్వానికి మార్గదర్శకంగా నిలిచే రోజుగా భావించాలి. సహకార భావనకు వాస్తవంగా భారతీయ సమాజంలో చక్కటి ఆదర్శాలున్నాయి. ఉమ్మడి వ్యవస్థలు, గ్రామ సభల సహకార జీవన విధానం, సహపంక్తి భోజనాలు, కలిసికట్టుగా వ్యవసాయం ం ఇవన్నీ ప్రాచీన భారత సహకార మౌలిక భావనలే. ఆధునిక సహకార ఉద్యమం మాత్రం 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో జన్మించింది. 1844లో రోచ్డేల్ పట్టణంలో పలువురు కార్మికులు కలిసి ఏర్పాటు చేసిన "రోచ్డేల్ సొసైటీ ఆఫ్ ఈక్విటబుల్ పైనీర్స్" ఆధునిక సహకార ఉద్యమానికి పునాది వేసింది. వారు ప్రవేశ పెట్టిన ప్రజాస్వామిక నియంత్రణ, స్వచ్ఛంద సభ్యత్వం, లాభాల సమాన పంపిణీ, శిక్షణ, విద్య వంటి సూత్రాలు నేటి సహకార విధానాలకు మార్గదర్శక మయ్యాయి. ప్రపంచ స్థాయిలో సహకారాల సమన్వయానికి ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయన్స్ అనే సంస్థ 1895లో ఏర్పడింది. ఇది ప్రస్తుతం 110 కంటే ఎక్కువ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రపంచ సహకార వేదిక. ×జూ, ఐక్యరాజ్య సమితి సంయుక్తంగా 1995లో ప్రారంభించిన అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై మొదటి శనివారానికి కేటాయించింది. వాస్తవానికి ప్రపంచం లోని విపత్తుల సమయంలో, సహకార సంస్థలు తమ సభ్యులకు ఆర్థిక, మానసిక, వృత్తి పరంగా అండగా నిలిచిన ఉదాహరణలు అనేకం. భారత దేశంలో సహకార భావన వ్యవస్థీకృతంగా 1904లో బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన సహకార క్రెడిట్ సంఘాల చట్టంతో ప్రారంభమైంది. తర్వాత 1912, 1969, 2002లో అనేక చట్టాలు రూపు దిద్దుకున్నాయి. స్వాతంత్ర్యానంతరం సహకార ఉద్యమానికి కొత్త ఊపొచ్చింది. గ్రామీణ వ్యవసాయ అభివృద్ధికి, ప్రజల ఆర్థిక స్వావలంబనకు ఇది కేంద్ర బిందువుగా నిలిచింది. 1954లో భారత ప్రభుత్వం సహకారాలను అభివృద్ధికి కీలక పునాది చేసుకోవాలని నినాదించింది. 1991 తర్వాత ఉదారీకరణ వల్ల కొన్ని సహకార సంస్థలు వెనకబడ్డా.. నేటికీ ఈ వ్యవస్థ ఎంతో మంది చిన్న రైతులకు, కార్మికులకు, మహిళలకు, గృహనిర్మాణ సంఘాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. సహకార ఉద్యమానికి శాశ్వత గుర్తింపు నిచ్చిన మహానుభావుడు డాక్టర్ వర్గీస్ కురియన్. ఆయనే భారత పాల విప్లవానికి శిల్పి. అమూల్ అనే గుజరాత్ పాల సహకారాన్ని స్థాపించి దేశ వ్యాప్తంగా లక్షలాది గోరక్షక రైతులను ఆర్థికంగా నిలబెట్టాడు. భారత్‌ను ప్రపంచ అగ్ర పాల ఉత్పత్తి దేశంగా తీర్చిదిద్దాడు. ఆయన చూపించిన సహకార నమూనా వ్యవసాయం, డెయిరీ రంగాల లోనే కాదు, గ్రామీణ అభివృద్ధి లోనూ ఆదర్శంగా నిలిచింది. లాభం కోసం కాదు, సభ్యుల సంక్షేమం కోసం సాగే కార్యకలాపాలే అసలైన సహకార లక్ష్యంగా ఆయన విశ్వసించాడు. ఇక ప్రాంతీయ స్థాయిలోనూ సహకార విజయాల కోసము ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. మహారాష్ట్రలోని షుగర్ కోఆపరేటివ్‌లు గ్రామీణ ఆదాయాన్ని పెంచే వనరులుగా మారాయి. గుజరాత్‌లో అమూల్, బనాస్కాంతా, మేహసానా డెయిరీలు ప్రపంచ స్థాయిలో నిలిచాయి. కేరళలో "కుడుంబశ్రీ" సహకార వేదికలుగా మహిళా సాధికారతకు మార్గం చూపుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విజయ డెయిరీ, తిరుమల డెయిరీ సహకార డెయిరీలు రైతుల పక్షంగా నిలుస్తున్నాయి. అలాగే గ్రామీణ బ్యాంకింగ్, పాడి పరిశ్రమ, గృహ నిర్మాణ సహకారాలు వేలాది కుటుంబాలకు జీవనాధారం అయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా 3 మిలియన్లకు పైగా సహకార సంస్థలు ఉన్నాయంటేనే వాటి ప్రభావాన్ని అంచనా వేసుకోవచ్చు. ఇవి 12 కోట్ల మందికి పైగా ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయి. భారత్‌లో 8 లక్షలకు పైగా సహకార సంస్థలు, 30 కోట్లకు పైగా సభ్యులతో ఈ రంగం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా సహకార బ్యాంకులు, గృహనిర్మాణ సంఘాలు, మార్కెటింగ్ సహకార సంస్థలు – ఇవన్నీ సామూహిక శక్తిని ఎలా ప్రదర్శించగలవో చూపిస్తున్నాయి. 2021లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహకార మంత్రిత్వ శాఖ ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోంది. దీని ద్వారా సహకార సంఘాల మధ్య సమన్వయం, పారదర్శకత, నూతన పునరాగమనం సాధ్యమవుతోంది. సహకార రంగంలో డిజిటల్ పరిష్కారాలు, నూతన ప్రణాళికలు అమలవుతున్నాయి. ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను మల్టీ-సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేయడం, ఉత్పత్తి-వితరణలో వాటి పాత్ర పెంపు వంటి కార్యక్రమాలు సాగుతున్నాయి. వ్యక్తిగత ప్రయోజనం కన్నా సమిష్టి ప్రయోజనం గొప్పదని ఈ దినోత్సవం మనకు గుర్తుచేస్తుంది. సహకార సంస్థలు మనకు నేర్పిన పాఠం – నమ్మకం, సమానత్వం, పరస్పర సాయంతో ముందుకు సాగటం. ఈ విలువలను మన జీవితాల్లో పాటించి, సహకార ఉద్యమాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన అవసరం నేడు మరింత ఎక్కువగా ఉంది. సహకారం అనేది కేవలం సంస్థ వ్యవస్థ మాత్రమే కాదు – అది జీవన పద్ధతి. మనం జీవన విధానాన్ని మార్చుకుంటేనే సమాజంలో స్థిరత్వం, సమానత్వం, సాధికారత సాధ్యం అవుతుంది. జూలై 5న జరుపుకునే అంతర్జాతీయ సహకార దినోత్సవం మనకు ఓ మార్గదర్శకం. ఇది మనకు సామూహిక శక్తిని గుర్తు చేస్తుంది. సమాన హక్కులు, నైతిక విలువలు, ప్రజా పాలన, ఆత్మనిర్భరత అనే లక్ష్యాలవైపు మన ప్రయాణాన్ని మళ్లిస్తుంది. సహకారం అనేది సమాజాన్ని అంధకారం నుంచి వెలుగులోకి తీసుకెళ్లే శక్తివంతమైన సాధనం. ఈ దినోత్సవం సందేశం ం "ఒక్కడే కాదు%ౕ% పలువురు కలిసినప్పుడు మార్పు సాధ్యం.. సహకారమే శాశ్వత అభివృద్ధికి మార్గం".


# యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించుట కొరకు సాధన చేయాలి




**రామడుగు, జూలై 04( ప్రభాత సూర్య):** దేశ ఔన్నత్యాన్ని నలు దిశల చాటి చెప్పిన యువకిశోరం స్వామి వివేకానంద అని, యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించుట కొరకు సాధన చేయాలి అని తహసిల్దార్ రాజేశ్వరి, మండల అభివృద్ధి అధికారి రాజేశ్వరి, రక్షక బట్టి అధికారి రాజు, మండల విద్యాధికారి వేణుగోపాల్ లు అన్నారు . జాతియ యువజన అవార్డు గ్రహిత అలువాల విష్ణు ఆధ్వర్యంలో శుక్రవారము ఉదయం రామడుగు మండలం వెదిరే ఎక్స్ రోడ్ వద్ద స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకొని స్వామి వివేకానంద విగ్రహానికి, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు , ప్రజలు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.. అనంతరం వారు మాట్లాడుతూ యువత సన్మార్గంలో ప్రయాణించాలని కోరారు. స్వామి వివేకానందుడు కేవలం కొన్ని సంవత్సరాలు మాత్రమే బ్రతికిన ఆయనను నేడు మనం కూడా ఆదర్శంగా తీసుకుంటున్నామంటే కారణం ఆయన యొక్క దార్శనికతనే ముఖ్య కారణమని అన్నారు.. విశ్వమంతా ఆధ్యాత్మిక వివేకానంద చేరపలేని జ్ఞానాన్ని విశ్వమంతా భారతీయ విలువల పంట వ్యక్తిత్వ వికాస ఋషి వివేకానంద పడి లేచే కెరటాన్ని ఆదర్శంగా చూడమని మందలో ఒక్కడివి కాక వందలో ఒకరివి కమ్మని వ్యక్తిత్వం కోల్పోతే సర్వస్వం కోల్పోతామని అన్నార్థులు అనాథలు అవనిపై ఉండద్దని ఈ భూవిపై ఆకలితో కుక్క కూడా చావద్దని ఇనుప కండరాలు ఉక్కు నరాలు ఉన్న యువకులని వజ్రమంటి మనసు ఉన్న భరతమాత పుత్రులు ఈ దేశ తలరాతను మారుస్తానన్న స్వామి వివేకానంద ఆలోచనలతో నేటి యువత ముందుకు సాగాలని అన్నారు . ఈ సంధర్బంగా జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి తెలంగాణకు నూతన యువజన విధానాన్ని ప్రకటించి, యువజన సంఘాల బలోపేతానికి కృషి చేస్తూ, స్వామి వివేకానంద జయంతి వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. వివిధ పార్టీల నాయకులు మేకల ప్రభాకర్ యాదవ్, జవ్వాజీ హరీష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలరహిత తెలంగాణగా మార్చేందుకు ప్రతి ఒక్క యువత కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, వివిధ పార్టీల నాయకులు నాగుల రాజశేఖర్ గౌడ్ ,మోడీ రవి, నేరెళ్ల ఆంజనేయులు గౌడ్, లేఖ రాజు, కిరణ్ తేజ, యువజన సంఘాల సమితి నాయకులు అమ్మిరి శెట్టి భూమిరెడ్డి, కొలిపాక కమలాకర్, గుండేటి శ్రీనాథ్, పన్యాల అశోక్ రెడ్డి, అలువాల శంకర్, పోచంపల్లి నరేష్, కటకం మనీష్, కొల్లురి అనిల్, అక్షయ్ యాదవ్, అశోక్, ఐలయ్య, సందీప్, సాయి ప్రసాద్, శ్రీనివాస్, సాయి కిరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్






**ప్రభాతవార్త వనపర్తి ప్రతినిధి** విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తాము చదివిన పాఠశాల, కళాశాలతో పాటు తమ భవిష్యత్తు కోసం సహకరిస్తున్న ప్రభుత్వానికి కూడా మంచి పేరు తేవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నాగవరం లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలలను, మరికుంట లో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను, అదేవిధంగా సాయి నగర్లోని బాలుర మైనారిటీ సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల,వల్లబ్ నగర్ లోని మైనారిటీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా గురుకులాల్లోని వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను ఆరా తీశారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని, అట్టి విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ప్రిన్సిపాల్ కి సూచించారు. గురుకులాల్లోని డార్మెటరీలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల వసతి, వారు పడుకోవడానికి కావలసిన పడకలు, మరుగుదొడ్ల సౌకర్యాలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు ఇంకా ఎన్ని పడకలు అవసరమని వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు ఫలితాలు ఎలా వస్తున్నాయి అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు.

**ప్రయోగాత్మక విధానంతో మెరుగైన ఫలితాలు**

నాగవరంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తాము చదివిన పాఠశాల, కళాశాలతో పాటు తమ భవిష్యత్తు కోసం సహకరిస్తున్న ప్రభుత్వానికి కూడా మంచి పేరు తేవాలని అన్నారు. ప్రయోగాత్మక విధానంతో పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడం ద్వారా సులువుగా నేర్చుకోవడమే కాకుండా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. విద్యార్థులు ఎప్పుడు కూడా తాము ఏ విషయంలోనూ వెనకబడి ఉన్నామని అనుకోవద్దని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థులందరూ జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకోవడమే కాకుండా, అన్ని అంశాలలో అప్డేటెడ్ గా ఉండాలన్నారు. బాగా చదువుకొని ఎంచుకున్న రంగాల్లో సమున్నతంగా రాణించి రాబోయే జూనియర్లకు ఆదర్శంగా నిలవాలన్నారు. హాస్టల్లో కొత్త డైట్ ప్లాన్ అమలవుతోందా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కళాశాలకు చెందిన విద్యార్థులు కళాశాలలోనే మిల్కీ వైట్ మష్రూమ్ పండించడాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. ఇటువంటి ప్రయోగాత్మక విధానాలను ఇంకా ముందుకు తీసుకువెళ్లాలని ప్రోత్సహించారు.

**ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్**

నాగవరంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల( పెద్దమందడి) లో కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు గణిత పాఠ్యాంశాలను బోధించారు. గణితంలో మెలకువలను తెలుసుకొని పాఠ్యాంశాలను నేర్చుకోవడం ద్వారా సులువుగా గణిత సమస్యలను సాధించవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గణిత శాస్త్రానికి సంబంధించి పలు ప్రశ్నలను అడిగి విద్యార్థుల ద్వారా సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు నోటు పుస్తకాలను బహుమతిగా అందజేశారు. డిఆర్డిఓ ఉమాదేవి, మైనారిటీ శాఖ అధికారి అఫ్జాలుద్దీన్, ఆయా గురుకులాల ప్రిన్సిపాల్ లు సరస్వతి, విజయలక్ష్మి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# యువతలో స్ఫూర్తి నింపే స్వామివివేకానంద బోధనలు నిరంతరం ఆదర్శనీయం

**బీవీపీ సంస్కార్ కన్వీనర్ చినుకని యువరాజు**

**చౌటుప్పల్, జూలై 04( ప్రభాత సూర్య):** యువతలో స్ఫూర్తి నింపే స్వామివివేకానంద బోధనలు నిరంతరం ఆదర్శనీయ మని భారత్ వికాస్ పరిషత్ కొమురంభీమ్ శాఖ సంస్కార్ కన్వినర్ చినుకని చినుకని యువరాజు పేర్కొన్నారు. భారత్ వికాస్ పరిషత్ కొమరం భీం బ్రాంచ్ చౌటుప్పల్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వేదికపై భారత ఆధ్యాత్మిక గొప్పదనం చాటిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా పురపాలక పరిధిలోని తంగడపల్లిలో గల స్వామి వివేకనంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ కొమరంభీమ్ శాఖ సంస్కార్ కన్వీనర్ చినుకని యువరాజు మాట్లాడుతూ..స్వామి వివేకానంద గొప్ప ఆధ్యాత్మికవేత్త, యువతకు మార్గదర్శకుడని అన్నారు. స్వామి వివేకానంద జీవితం ఆత్మబలంతో కూడిన సందేశాలు ప్రతి యువకుల్ని మార్గదర్శనం చేస్తాయని తెలిపారు. ప్రపంచ వేదిక పి భారత ఆధ్యాత్మిక గొప్పదాన్ని చాటిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనదని కొనియాడారు. భారతీయ సంస్కృతి ఆధ్యాత్మికత గొప్పతనాన్ని, యువతలో స్ఫూర్తి నింపే ఆయన బోధనలు ఎప్పటికీ ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బివిపి శాఖ అధ్యక్షులు చీకురి వెంకటేశం గౌడ్, కార్యదర్శి నేదనూరి గణేష్,రాచమల్ల వెంకన్న, బొల్లమోని శ్రీశైలం, గట్టు మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



## కాలువలో భారీ కొండచిలువ

**9 అడుగుల కొండచిలువను స్నేక్ సొసైటీ అధ్యక్షుడు చీర్ల కృష్ణ సాగర్ ఆధ్వర్యంలో బంధించారు.**




**వనపర్తి ప్రభాతవార్త ప్రతినిధి...** శుక్రవారం రోజు పెద్దమందడి మండలం మోజెర్ల గ్రామ శివారులో శంకర్ సముద్రం రిజర్వాయర్ నుంచి ప్యాకేజీ 19 కెనాల బ్రిడ్జి మరమ్మత్తు పనులు జరుగుతున్నాయి బ్రిడ్జ్ కింద అడవి పందులు ఏర్పాటు చేసుకున్న పెద్ద రంధ్రంలో కొండచిలువ కూలి రామస్వామి చూసి అక్కడే ఉన్న ఇరిగేషన్ ఏఈ రమేష్ కాంట్రాక్టర్ ధనుంజయ్ విషయాన్ని తెలియజేశారు పామును చూసిన ఏ ఈ రమేష్ కొత్తకోటలో ట్రాఫిక్ లో పనిచేస్తున్న సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షులు కృష్ణ సాగర్ కి ఫోన్ చేసి సమాచారాన్ని ఇచ్చారు మధ్యాహ్నం పెద్దమందడి మండలం మోజర్ల గ్రామానికి చేరుకొని బ్రిడ్జి కింద ఉన్న కొండచిలువను చూసి పామును బయటకి తీయడం కష్టంగా ఉంటుంది అని తెలిపారు, అక్కడే ఉన్న హిటాచి మిషన్ సహాయంతో బ్రిడ్జి కింద గుంత తీసిన అనంతరం గుంతలోకి వెళ్లి 11అడుగుల పెద్ద కొండచిలువను అందించారు అనంతరం ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల నుంచి వనపర్తి జిల్లా ప్రాంతాలలో జంతు జాతులు,పక్షులు, ప్రాణులు వృద్ధి పెరిగిందని అందుకు కారణం ఇక్కడ పుష్కలంగా నీళ్లు ఉండడం తోనే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పంట పొలాల్లోకి అడవి జంతువుల పాముల సంఖ్య పెరిగింది కాబట్టి సమీప గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరికైనా అడవి జంతువులు పాములు కనబడితే నాకు సమాచారం ఇవ్వవలసిందిగా తెలిపారు. బంధించిన కొండచిలువను పెద్దమందడి సెక్షన్ ఆఫీసర్ నరేష్ సూచన మేరకు అడవి ప్రాంతంలో వదిలేస్తామని తెలిపారు , ఈ కార్యక్రమంలో సాగర్ స్నేక్ సొసైటీ సభ్యుడు చిలుక కుమార్ సాగర్, కాంట్రాక్టర్ ధనుంజయ్, మన్యం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు,

## ఆషాడంలో శాకంబరిదేవిగా దర్శనం..

**శ్రీ అంబా భవాని మాత శాకంబరిదేవిగా దర్శనమిచ్చింది. దాదాపు వేయి కిలోల కాయగూరలు, పండ్లుతో అమ్మవారి విగ్రహాన్ని అలంకరించారు.**





**వనపర్తి ప్రభాతవార్త ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణం లో కొలువై ఉన్న శ్రీ అంబా భవాని మాతగా కొలిచిన వారికి శక్తి స్వరూపిణిగా కొత్తకోట గ్రామాన్ని అభివృద్ధి మార్గాన నడిపిస్తూ భక్తులకు ఆయురారోగ్య అష్టైశ్వర్యాలను ప్రసాదించి వరాలిస్తున్న మహా మహిమాన్వితురాలు భవాని మాత కు ఇష్టమైన ఆషాఢమాసం రెండవ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పలు రకాల కూరగాయలతో శాకాంబరీ మాత గా భక్తులకు దర్శనమిచ్చింది ఆలయ ప్రధాన అర్చకులు మఠం సాదాశివయ్య , మఠం ఆనందయ్య ప్రత్యేక పూజలు ,ఆభిషేకాలు,అష్టోత్తరాలు నిర్వహించారు. కొత్తకోట పట్టణ మహిళలు 41 రకాల పిండివంటలతో పుట్టింటి సారేగా అమ్మవారికి నైవేద్యం సమర్పించి అర్పించారు ప్రత్యేక పూజలు సందర్భంగా మహిళలు పెద్దఎత్తున ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పొగాకు అనీల్ కుమార్ కొత్తకోట గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు...

## వంట కార్మికుల పెండింగ్ బిల్లులు, విడుదల చేయాలి

**అఖిలపక్ష ఐక్యవేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్**



**వనపర్తి ప్రభాతవార్త ప్రతినిధి** పాఠశాల మధ్యాహ్న భోజన వంట కార్మికుల పెండింగ్ బిల్లులు, వెంటనే విడుదల చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వనపర్తి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు. అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ బడులలో ఉంటే వంట చేసే వారికి 18 నెలలుగా బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం ఉందని బియ్యం తప్ప మిగతా 32 వస్తువులు వారే తెచ్చుకుని పిల్లల కడుపు నింపుతున్న వంట చేసే మహిళలు తమ ఒంటి మీద ఉన్న బంగారం అమ్ముకుని వంట చేసే సామాను తెచ్చి పిల్లలకు కడుపు నింపుతున్నారని అన్నారు. తెచ్చిన పంట సామాన్లకు ప్రభుత్వం వారితో డబ్బులు పెట్టించి కష్టం చేయించి సంవత్సరాలుగా బిల్లులు ఇవ్వకపోగా వారిని ఇబ్బంది పెట్టడం సరికాదని, వెంటనే వారికి బిల్లును చెల్లించాలని డిమాండ్ చేశారు, ముఖ్యమంత్రి చదివిన వనపర్తి పట్టణంలోని ఇలా ఉంటే మిగతా జిల్లాల పరిస్థితి ఏమని ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ విస్మయం వ్యక్తపరిచారు. వెంటనే కలెక్టర్ ఎమ్మెల్యే వనపర్తి లో ఉన్న పాఠశాలల వంట చేస్తున్న సిబ్బందికి బిల్లు చెల్లించాలని కోరారు,ఈ కార్యక్రమంలో కొత్తగొల్ల శంకర్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, రామస్వామి, గంధం భరత్, నాగరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు..

## చిలువేరు బిక్షం మృతి కుటుంబానికి తీరని లోటు

**కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం నిత్యవసరాలు అందజేసిన విద్యార్థి నాయకుడు మాజీ ఎంపీటీసీ సిలువేరు విష్ణు**



**మర్రిగూడ ప్రభాత సూర్య** మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన సిలువేరు బిక్షం (మూగ) మృతి బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు తీరని లోటు అని మునుగోడు నియోజకవర్గ విద్యార్థి ఉద్యమ నాయకుడు సిలువేరు విష్ణు అన్నారు ఈ సందర్భంగా శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యుల కు తన సొంత ఖర్చుతో 50 కేజీల బియ్యం నిత్యవసరాలు అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబానికి ఏ సమస్యలు వచ్చిన ఆదుకుంటాను హామీ ఇచ్చారు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని అన్నాడు ఈ కార్యక్రమంలో మునగాల నాగిరెడ్డి నడిమింటి శీను చిలువేరు గిరి, బిక్షం, రాములు, యాదయ్య, కాస శీను, సిలువేరు కృష్ణ, శివ, కర్నాటి శివ గౌడ్, సిరికొండ వెంకటయ్య తదితులు పాల్గొన్నారు

## తెలంగాణ వేగు చుక్క దొడ్డి కొమురయ్య కురుమ

**బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ**



**తుర్కయంజాల్,జూలై 04, ప్రభాత సూర్య:** గడీల పాలనపై గర్జించి రజాకార్ల వెన్నులో వణుకు పుట్టించిన బహుజన వీరుడు అని బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ అన్నారు.శుక్రవారం బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిటీ ఉపాధ్యక్షులు లపంగి రాజు అధ్యక్షతన తుర్కయాంజాల్ అంబేద్కర్ చౌరస్తా లో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిథి గా అద్యక్షులు పట్నం రమేష్ కురుమ పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.వారు మాట్లాడుతూ గడీల పాలనపై గర్జించి రజాకార్ల వెన్నులో వణుకు పుట్టించిన బహుజన వీరుడు, తెలంగాణ పోరాటంలో తొలి సమిధ, నిజాం పై అలుపెరగని పోరాటం చేసిన వీర యోధుడు దొడ్డి కొమురయ్య అని కొమురయ్య ని ఆదర్శంగా తీసుకొని బహుజన రాజ్యాధికారం వైపు అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు,మాజీ కార్యదర్శి జంతుక సైదులు,కోహెడ సెక్టార్ అద్యక్షులు శీలం అంగద్ కుమార్, రాజు,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆలూరు సాంబశివారెడ్డి నియామకం

**జగనన్నకు కృతజ్ఞతలు తెలిపిన ఆలూరు**



**అనంతపురం, జూలై 04( ప్రభాత సూర్య):** వైయస్సార్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, అనంతపురం జిల్లాకు చెందిన పార్టీ ఎన్ఆర్ఐ వింగ్ కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డిని పార్టీ "రాష్ట్ర ప్రధాన కార్యదర్శి"గా నియమించారు.కూటమి ప్రభుత్వం దాఖలు చేసిన అక్రమ కేసు కారణంగా, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌ఛార్జ్ డా. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందుబాటులో లేరు. ఆయన తిరిగి వచ్చే వరకు, ఆలూరు సాంబశివారెడ్డి తాత్కాలికంగా పార్టీ అనుబంధ విభాగాల వ్యవహారాలను పర్యవేక్షిస్తారని పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి ఆలూరు సాంబశివారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.పార్టీకి అండగా ఉంటూ, పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. అలాగే, పార్టీ అనుబంధ విభాగాల వ్యవహారాలను జగనన్న సూచనల మేరకు పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు.

## నాటు సారా తయారీ: కేసు నమోదు



**మర్రిగూడ: (ప్రభాత సూర్య)** మర్రిగూడ మండలంలో వెంకేపల్లి తండా సమీపంలో నాటు సారా తయారుచేసి అమ్ముతున్నట్లు నమ్మదగిన సమాచారంతో శుక్రవారం రోజున ఎస్ ఐ మునగాల కృష్ణారెడ్డి తన సిబ్బందితో వెళ్లి జటావ దశరథ పొలంలో తనిఖీ చేసినారు తనిఖీలు మూడు లీటర్ల నాటుసారా 2 క్వింటాళ్ల నల్ల బెల్లం 10 కేజీల పట్టిక స్వాధీనం చేసుకుని నమోదు చేశారు సిబ్బంది శంకర్ రెడ్డి వహీద్ ఉన్నారు

## ప్రభుత్వ జూనియర్ కళాశాల కు పూర్వ విద్యార్థి కుర్చీలు విరాళం



**సంస్థాన్ నారాయణపురం, జూలై 04( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల చిమిర్యాల గ్రామానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి మల్లేపల్లి నర్సింహా రెడ్డి వారి తండ్రి మల్లేపల్లి గోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం తను చదివిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 16వేల రూపాయల విలువ చేసే పది కుర్చీలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహా రెడ్డి ని కళాశాల ప్రిన్సిపాల్ బి. మాతేశ్వరి , అధ్యాపకులు మరియు సిబ్బంది అభినందించారు

# చేనేత సమస్యలు పరిష్కరించాలి

### తహసీల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ చేనేత కార్మిక సంఘం నాయకులు



**సంస్థాన్ నారాయణపురం, జూలై 04( ప్రభాత సూర్య):** సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను గట్టెక్కించేందుకు ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు కర్నాటి మారయ్య ప్రభుత్వాన్ని కోరుతూ సంస్థాన్ నారాయణపురం తహసీల్దార్ కు వినతి పత్రం శుక్రవారం అంద జేశారు. సంస్థాన్ నారాయణ పురానికి మూడేళ్ల క్రితం చేనేత క్లస్టర్ కు మంజూరైన రూ.75 లక్షలు వెంటనే విడుదల చేసి పనులు చేపట్టాలని కోరారు. సంస్థాన్ నారాయణపురం చేనేత సహకార సంఘంలో 390 మంది సభ్యులు ఉన్నారని, వారు ఏడాదికి 5000 పట్టు చీరలు ఉత్పత్తి చేయగలరని తెలిపారు. ఆ చీరలను టెస్కో ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రొక్యూర్మెంట్ ఆర్డర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక చేనేత సహకార సంఘానికి నాబార్డు ద్వారా రూ. 18 లక్షలు క్యాష్ క్రెడిట్ మాత్రమే ఇచ్చారని అది పెట్టుబడికి సరిపోనందున రూ.ఒక కోటికి పెంచాలని, క్యాష్ క్రెడిట్ రుణాన్ని మాఫీ చేయాలని కోరారు. చేనేత మగ్గాలన్నింటికీ జియో ట్యాగ్ చేయించాలని, చేనేత పొదుపు పథకంలో గతంలో మాదిరిగా ముగ్గురు అనుబంధ కార్మికులకు అవకాశం ఇవ్వాలని, 40% నూలు రాయితీ పథకాన్ని పునరుద్ధరించాలని, జియో టాక్ ఉన్న ప్రతి మగ్గానికి లక్ష చొప్పున వడ్డీ లేని రుణం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వినతి పత్రాలను ముఖ్యమంత్రికి, చేనేత జౌళి శాఖ మంత్రి కి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కు పంపినట్టు ప్రకటించారు. కార్యక్రమంలో చేనేత పారిశ్రామికులు పగిడిమర్రి విష్ణు, సురపల్లి జనార్ధన్, గంజి వెంకటేశం, గంజి శీను, రాములు, అంజయ్య, చెరుపల్లి లక్ష్మయ్య, అంజయ్య, దోర్నాల శ్రీనివాస్, సింగం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ రద్దుకు ఆర్ఎస్ఎస్ బీజేపీ కుట్రలు

- బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై పెరిగిన దాడులు
- భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి
- కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా సామాజిక శిక్షణ తరగతుల్లో
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు



**తుర్కయంజాల్,జూలై 04, ప్రభాత సూర్య:** భారత రాజ్యాంగంలో సోషలిజం సెక్యులరిజం పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ నేత దత్తాత్రేయవసలే వ్యాఖ్యానించడం దేశ ప్రజలందరినీ అవమానించినట్లేనని రాజ్యాంగం రద్దుకు ఆర్ఎస్ఎస్ బిజెపి కుట్రలు చేస్తున్నాయని నేటితరం ఐక్యంగా బిజెపి విధానాలను ప్రతిఘటించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు మాజీ కేవీపీస్ రాష్ట్ర అధ్యక్షులు కడిగాళ్ల భాస్కర్ లు పిలుపునిచ్చారు శుక్రవారం మన్నెగూడా %అంతీ% నగర్ కాల చలసాని కళ్యాణ మండపంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులు కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లూరి భాస్కర్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు ఈ సమావేశానికి ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ గారు కేవీపీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కాడి గళ్ళ భాస్కర్ మల్ల వస్తున్నాడు భాస్కర్ లు మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై క్రూర దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఈ అమానవీయ సంఘటనలతో దేశం సిగ్గుతో తలదించుకుంటుందన్నారు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాలో ఇద్దరు దళిత యువకులు ఆవు దూడలను తీసుకెళ్తుండగా గోరక్షక దళాల ముసుగులో ఆర్ఎస్ఎస్ మతోన్మాద గో గుండాలు అమానవీయ చర్యలకు ఒడిగట్టారని అన్నారు. అరగుండు కొట్టించి బలవంతంగా మురుగునీటిలో ముంచి మోకాళ్లపై ఊరిలో నడిపించడం గడ్డి తినిపించడం వంటి చిత్రహింసల పాలు చేశారని చెప్పారు. గోరక్షక దళాలు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నాయని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నాయని,గోరక్షక దళాలను తక్షణమే నిషేధించాలన్నారు ఆ దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోరక్షక దళాలు ఆర్ఎస్ఎస్ ప్రోత్బలంతోనే ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్నారని అన్నారు. 78 ఏళ్ల స్వాతంత్రం తర్వాత మధ్యయుగాల కాలంనాటి శిక్షలను ఇంకా ఈ దేశం భరించాలా? అని ప్రశ్నించారు ప్రజలు ప్రజాస్వామిక వాదులు ముక్తకంఠంతో ఖండించాలన్నారు బిజెపి పాలిత రాష్ట్రాల్లో అట్టడుగు వర్గాల పై జరుగుతున్న ఈ అమానవీయ సంఘటనలను అందరూ ఐక్యంగా ఖండించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ క్రింద 19 వేల మంది దళిత విద్యార్థులకు 154 కోట్ల రూపాయలు పెండింగ్ లో ఉన్నాయని వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలని రైతాంగ పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని వ్యవసాయ కూలీల కు రెండు వందల రోజుల పని దినాలు కల్పిస్తూ రోజుకు 600 రూపాయలకు ఇవ్వాలని డిమాండ్ తో పాటు రాజ్యాంగ రక్షణ రిజర్వేషన్ల పరిరక్షణ ప్రభుత్వ సంస్థల పరిరక్షణ కోసం జూలై 9న దేశవ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెలు సామాజిక శక్తులు సమైక్యంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు ఈ క్లాసులలో కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడ సామిల్, మస్కు ప్రకాష్ శరత్, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్, దుబ్బ చెన్నయ్య, ఎర్ర వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, వీరేష్, మాలాద్రి, నాయకులు జయ, ఆశీర్వాదం, ఎం సత్యనారాయణ, రామదాస్,ప్రభాకర్, స్కైలాబ్ అశోక్, గిరి, రాజు, ప్రవీణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త స్ట్రాటజీలో జగన్



**విజయవాడ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ వేగం పెంచారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తి కావడంతో ఇక జనంలోకి వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అలాగే కొత్త నేతలకు కూడా అవకాశం కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారిని ఇక పార్టీలోకి తిరిగి తీసుకోకుండా వారి స్థానంలో యువనేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగానే నిన్న జరిగిన పార్టీ యువజన విభాగం నేతలతో జరిగిన సమావేశంలో మంచి నేతలను గుర్తించి పార్టీలోకి తీసుకు రావాలని అనడం కూడా అందులో భాగమేనని అంటున్నారు. కొన్ని నియోజక వర్గాలలో ఇప్పటి వరకూ ఇన్ ఛార్జులను నియమించకపోవడంతో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది.వైసీపీ ఖచ్చితంగా ఈ సారి అధికారంలోకి వస్తుందని భావిస్తున్న జగన్ అందుకు అనుగుణంగా కార్యకర్తలకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. యువజన విభాగాన్ని పటిష్టం చేయడంతో పాటు పార్టీ అనుబంధ విభాగాలను కూడా మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కేసులకు భయపడి వెనుకంజ వేయవద్దని పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని భరోసా ఇస్తూ ఇక ఎఫెన్స్ లో వెళ్లేందుకు జగన్ నిర్ణయించుకుంటున్నట్లు తెలిసింది. అందుకే యువకులతో పాటు విద్యార్థి విభాగాన్ని కూడా బలోపేతం చేయడంతో పాటు మహిళ విభాగాన్ని కూడా మరింతగా శక్తిమంతం చేసి అధికార పార్టీకి కంటి మీద కునుకు లేకుండా చేయాలన్న యోచనలో ఉన్నారు.. త్వరలోనే వైఎస్ జగన్ వైసీపీ విద్యార్థి విభాగం, మహిళ విభాగం నేతలతో కూడా సమావేశం అయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరొక వైపు జగన్ తాను స్వయంగా సమస్యలపై జిల్లాలను పర్యటిస్తూ పార్టీకి మరింత హైప్ తేవాలని ప్రయత్నిస్తున్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా ఏ వర్గాన్ని దూరం చేసుకోకుండా దగ్గరకు తీసుకునే యత్నంలోనే జగన్ ఉన్నట్లు కనపడుతుంది. గుంటూరులో మిర్చిరైతులు, పొదిలిలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధరల కోసం వెళ్లి వారితో మాట్లాడిన జగన్ తాజాగా ఈనెల 9న చిత్తూరు జిల్లా మామిడి రైతులతో కూడా సమావేశం కానున్నారు. ఇలా జిల్లా పర్యటనలతో పాటు మరొకవైపు పార్టీ అనుబంధ విభాగాలపై కూడా ఫోకస్ పెట్టారు. వైసీపీ సోషల్ మీడియా వింగ్ ను కూడా బలోపేతం చేసే దిశగా జగన్ ప్రయత్నాలు ప్రారంభించారు. సోషల్ మీడియా వారియర్స్ పై అక్రమ కేసులు పెడుతున్నారని, అయినా బెదరకుండా పనిచేసిన వారికి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతూ వస్తున్నారు. వైసీపీకి సోషల్ మీడియా బలం ఎక్కువ అన్న నేపథ్యంలో ఇటీవల అక్రమ కేసులతో కొంత వెనకబడి ఉండటాన్ని గమనించిన జగన్ ఆ దిశగా వారికి ధైర్యాన్ని కల్పించి, కేసులు వస్తే తాము అండగా ఉంటామని చెబుతున్నారు. మొత్తం మీద పార్టీ నేతలపై జగన్ ఆధారపడకుండా ఇక అనుబంధ విభాగాలను బలోపేతం చేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు కనపడుతుంది.

# బిజినెస్


## టీవీఎస్ నుంచి మరో ఎలక్ట్రిక్ స్కూటర్



ఇప్పటికే ఐక్యూబ్ మాడల్ 6 లక్షల యూనిట్లకు పైగా అమ్ముడయ్యాయి. ఈ కొత్త వేరియంట్ ప్రతిరోజు ప్రయాణించడానికి అనుకూలంగా రూపొందించింది కంపెనీ. డ్యూయల్ టోన్ కలర్స్, బ్యాక్‌రెస్ట్, బ్యాటరీ కెపాసిటీని అప్‌గ్రేడ్ చేసి ఈ మాడల్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చారు..


ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా ఉన్న నేపథ్యంలో చాలా మంది ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఆటోమొబైల్ రంగంలో సరికొత్త ఎలక్ట్రిక్ కార్లు, స్కూటర్లు వస్తున్నాయి. కంపెనీలు కూడా తక్కువ ధరల్లో వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. ఇప్పటికే కార్లు, స్కూటర్లు రాగా, మరిన్ని ఎలక్ట్రిక్ స్కూటర్లు మార్కెట్లో విడుదలవుతున్నాయి. పోటీపోటీగా కంపెనీలు అత్యధునిక ఫీచర్స్‌ను జోడిస్తూ ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకువస్తున్నాయి. ఇక ప్రముఖ వాహన సంస్థ టీవీఎస్ మోటర్ మార్కెట్లోకి సరికొత్త ఐక్యూబ్ ఈ-స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. టీవీఎస్ ఐక్యూబ్ సిరీస్‌కు మరో కొత్త వేరియంట్‌ను జోడించింది. మెరుగైన ఫీచర్స్‌తో తీర్చిదిద్దిన ఈ మాడల్ ధరను రూ.1.03 లక్షలుగా నిర్ణయించింది. హిల్ హోల్డ్ అసిస్ట్, 3.1 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 123 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుంది.కాగా, ఇప్పటికే ఐక్యూబ్ మాడల్ 6 లక్షల యూనిట్లకు పైగా అమ్ముడయ్యాయి. ఈ కొత్త వేరియంట్ ప్రతిరోజు ప్రయాణించడానికి అనుకూలంగా రూపొందించింది కంపెనీ. డ్యూయల్ టోన్ కలర్స్, బ్యాక్‌రెస్ట్, బ్యాటరీ కెపాసిటీని అప్‌గ్రేడ్ చేసి ఈ మాడల్‌ను అభివృద్ధి చేసినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## ఈ బ్యాంకు కస్టమర్లకు బిగ్ రిలీఫ్..
## మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీల ఎత్తివేత





సేవింగ్స్ ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ నిర్వహణ ఛార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. సేవింగ్స్ అకౌంట్లో మినిమమ్ బ్యాలెన్స్ ఉండాలన్న నిబంధనలను ఎత్తివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ నియమం ఈనెల అంటే జూలై 7 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపింది.. బ్యాంకు అకౌంట్లో మినిమమ్ బ్యాలెన్స్ లేకుండా ఛార్జీల బాదుడు ఉంటుందన్న విషయం అందరికి తెలిసిందే. కొన్ని బ్యాంకులు కనీస బ్యాలెన్స్ ఛార్జీలు ఎత్తివేసినా చాలా బ్యాంకులు ఈ విధానం కొనసాగిస్తూనే ఉన్నాయి. దేశీయంగా బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు వరుసగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. దేశంలోని రెండో అతిపెద్ద బ్యాంకుగా పేరుగాంచిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రకటన చేసిన మరుసటి రోజునే మరో ప్రభుత్వ బ్యాంక్ అలాంటి కీలక ప్రకటన చేసింది. సేవింగ్స్ ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ నిర్వహణ ఛార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ ప్రకటించింది. సేవింగ్స్ అకౌంట్లో మినిమమ్ బ్యాలెన్స్ ఉండాలన్న నిబంధనలను ఎత్తివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ నియమం ఈనెల అంటే జూలై 7 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపింది.

# లక్ష మంది టెకీలపై వేటు
# ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన



టెక్నాలజీ రంగంలోని కంపెనీలు భారీ లాభాలను గడిస్తున్నప్పటికీ.. మరింత ఆదాయాల కోసం పొదుపు చర్యలకు దిగుతు న్నాయి. ఈ క్రమంలోనే వేలాది మంది ఉద్యోగుల కు ఉద్వాసన పలుకుతున్నాయి. కేవలం ఆరు నెలల సమయంలోనే లక్ష మంది పైగా ఉద్యోగుల పై వేటు వేశాయని రిపోర్టులు వచ్చాయి. గతేడాది ఆర్థిక మాంద్యం భయాలతో వేలాది మందిని రోడ్డున పడేసిన కంపెనీలు.. తాజాగా కృత్రిమ మేధను బూచీగా చూపి, అదే విధంగా పునర్ వ్యవస్థీకరణ పేరుతో వేటు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది తొలి అర్ధభాగంలో ఇప్పటికే లక్ష మందికి పైగా ఉద్యోగులను తొలగించాయి. అత్యధికంగా సిబ్బందిపై వేటు వేసిన వాటిలో మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా, ఇంటెల్ వంటి సంస్థలున్నాయి. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 4 శాతానికి సమానమైన 9,100 మందిని తొలగిస్తున్నట్లు ఈ వారంలోనే తెలిపింది. ఈ ఏడాదిలో తొలగింపులు నాలుగో సారి కావడం ఆందోళనకరం. జనవరిలో 1 శాతం మందిని తొలగించగా.. మేలో 6,000 మందిని, జూన్‌లోనూ 300 మంది సిబ్బందిపై వేటు వేసింది. గతేడాది కూడా ఈ కంపెనీ దాదాపు 10,000 మందిని అర్ధంతరంగా తొలగించింది. ఎలక్ట్రానిక్ చిప్‌ల తయారీ సంస్థ ఇంటెల్ ఇప్పటికే జర్మనీలోని ఆటోమోటివ్ చిప్ యూనిట్ ను మూసేసి అందులోని మొత్తం సిబ్బందిని తొలగించింది. కంపెనీ హెడ్ క్వార్టర్స్‌లోనూ దాదాపు 100 మందికి ఎసరు పెట్టింది. జులై మధ్యలో కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం సిబ్బందిలో 20శాతం మందిని ఇంటికి పంపించే పనిలో ఉంది. అమెజాన్ ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నాలుగు సార్లు ఉద్వాసనలు చేపట్టింది. ఆయా దశల్లో మొత్తంగా 14,000 మంది పైగా సిబ్బందిపై వేటు వేసింది. రానున్న రోజుల్లోనూ మరింత ఎక్కువ తొలగింపులు ఉండొచ్చని సంకేతాలు ఇచ్చింది. ఐబిఎం ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 8.000 మందిని తొలగించింది. భారత్‌కు చెందిన ఇన్ఫోసిస్ ఇటీవల 240 మంది ఎంట్రీ లెవల్ ఉద్యోగులను తొలగించింది. ఫిబ్రవరిలోనూ 300 మంది ఫ్రెషర్స్‌ను ఇంటికి పంపించింది. గూగుల్ వరుస ఉద్వాసనలకు పాల్పడినప్పటికీ స్పష్టమైన సంఖ్య బయటికి రాలేదు. మెటా దాదాపు 3600 మంది సిబ్బందిని రోడ్డున పడేసింది. హెచ్‌పి 2000 మందిని తొలగించింది. టిక్‌టాక్ తన డబ్లిన్ కార్యాలయంలో 300 మందిపై వేటు వేసింది. ఓలా ఎలక్ట్రిక్ వెయ్యి మందికి పైగా ఉద్యోగులకు కోత పెట్టింది. సేల్స్‌ఫోర్స్, బ్లూఆర్జిన్ సంస్థలు 1000 మంది చొప్పున తొలగించాయి. ఈ పరిణామాలు టెకీలను బెంబేలెత్తిస్తున్నాయి. తమ ఉద్యోగం ఎప్పుడు ఊడుతోందోననే భయాందోళనలో ఉన్నారు.

# భారీగా తగ్గిన బంగారం ధర..



అంతర్జాతీయ మార్కెట్‌లో బులియన్ మార్కెట్ రేట్లు మన దేశంలో బంగారం ధరలపై ప్రభావం చూపుతాయి. ఇంకా అమెరికా డాలర్, రూపాయి మారక విలువ కూడా ఎఫెక్ట్ చూపిస్తుంది. భౌగోళిక ఉద్రిక్త పరిస్థితులు కూడా బంగారం ధరలను నిర్ణయిస్తాయి. అందుకే గోల్డ్ ధరలు స్థిరంగా ఉండవు. ఇటీవల నుంచి తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు.. గత రెండు, మూడు రోజుల నుంచి పరుగులు పెడుతోంది. ఉదయం పెరిగిన బంగారం ధరలు.. కొన్ని గంటల్లోనే భారీగా పతనమైపోయింది. దేశంలో సామాన్యులు కొనలేని పరిస్థితుల్లో బంగారం ధరలు ఉంటున్నాయి. మళ్లీ లక్ష రూపాయలకు చేరువలో ఉన్న పసిడి.. శుక్రవారం ఉదయం 10 గంటల సమయానికి తగ్గుముఖం పట్టింది. జూలై 3న బంగారం ధరలో పెరుగుదల కనిపించింది. అయితే, ఈరోజు బంగారం ధర మునుపటి రోజుతో పోలిస్తే భారీగా తగ్గింది. గుడ్ రిటర్న్స్ ప్రకారం.. ఈరోజు ఉదయం వరకు బంగారం ధర రూ.600 తగ్గింది. దీనితో, ఈరోజు దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.98,730 వద్ద కొనసాగుతుండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాములకు రూ.90,500 వద్ద కొనసాగుతోంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.98,880కి కొనుగోలు చేయవచ్చు. ఇది రూ.600 తగ్గింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,650కి చేరుకోగా, 18 క్యారెట్ల బంగారం 74,170కి చేరుకుంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములకు) ధర రూ.98,730. 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,500, 18 క్యారెట్ల బంగారం రూ.74,050కి కొనుగోలు చేయవచ్చు. ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములకు) ధర రూ.98,730 ఉండగా. 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,500, 18 క్యారెట్ల బంగారం రూ.74,050కి కొనుగోలు చేయవచ్చు. ఇక వెండి విషయానికొస్తే కిలో వెండిపై వెయ్యి రూపాయల వరకు తగ్గుముఖం పట్టి ప్రస్తుతం కిలో వెండి ధర 1 లక్షా 10 వేల రూపాయల వద్ద కొనసాగుతోంది. ఇక చెన్నై, హైదరాబాద్, కేరళ రాష్ట్రాల్లో కిలో వెండి ధర ఎక్కువగానే ఉంది. ప్రస్తుతం 1 లక్షా 20 వేల వరకు ఉంది.

# స్పోర్ట్స్

# వరుస సెంచరీలు.. జట్టులో స్థానం గల్లంతు



బంగ్లాదేశ్ టెస్ట్ జట్టు కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటోపై వేటు పడింది. త్వరలో శ్రీలంకతో జరుగబోయే టీ20 సిరీస్ కోసం అతన్ని ఎంపి?క చేయలేదు. ఇటవలి కాలంలో షాంటో పొట్టి ఫార్మాట్‌లో పేలవ ఫామ్‌లో ఉన్నాడు. ఈ కారణంగానే అతన్ని టీ20 జట్టు నుంచి తప్పించినట్లు సెలెక్టర్లు తెలిపారు. బ్యాటింగ్‌పై దృష్టి సారించేందుకు షాంటో ఇటీవలే టీ20 కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. ఈ లోపే అతన్ని జట్టు నుంచే తప్పించారు. షాంటో ప్రస్తుత శ్రీలంక పర్యటనలో జరిగిన తొలి టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేశాడు. అయినా అతన్ని టీ20 జట్టు నుంచి తొలగించారు. షాంటో గత కొద్ది రోజులుగా తరుచూ వార్తల్లో నిలుస్తున్నాడు. బోర్డుతో విబేధాల కారణంగా అతను టెస్ట్ కెప్టెన్సీ నుంచి తప్పుకుంటాడని వార్తలు వస్తున్నాయి. షాంటో గతేడాది ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ ఆల్ ఫార్మాట్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అనంతర పరిణామాల్లో అతను పరిమిత ఓవర్ల కెప్టెన్సీని వదిలి పెట్టాడు. జులై 10 నుంచి శ్రీలంకతో జరుగబోయే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం బంగ్లాదేశ్ జట్టును ఇవాళ (జులై 4) ప్రకటించారు. ఈ జట్టులో షాంటోతో పాటు మరో ఐదుగులు స్థానాలు కోల్పోయారు. పాకిస్తాన్‌తో చివరిగా ఆడిన జట్టులో సభ్యులైన సౌమ్య సర్కార్, హసన్ మహమూద్, తన్వీర్ ఇస్లాం, నహీద్ రాణా, ఖలీద్ అహ్మద్ లంకతో సిరీస్‌కు ఎంపిక కాలేదు. ఆల్‌రౌండర్ మొహమ్మద్ సైఫుద్దీన్ ఏడాది తర్వాత తిరిగి జట్టులోకి వచ్చాడు. తస్కిన్ అహ్మద్, షోరీఫుల్ ఇస్లాం, ముస్తాఫిజుర్ రెహ్మాన్, నసుమ్ అహ్మద్ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చారు. జులై 10, 13, 16 తేదీల్లో పల్లెకెలె, దంబుల్లా, కొలొంబో వేదికలుగా శ్రీలంకతో మూడు టీ20లు జరుగనున్నాయి. ప్రస్తుతం బంగ్లాదేశ్ శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడుతుంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్ శ్రీలంక 77 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అంతకుముందు జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను శ్రీలంక 1-0 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో తొలి టెస్ట్ డ్రా కాగా.. రెండో టెస్ట్‌లో శ్రీలంక ఇన్నింగ్స్ 78 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రేపు కొలొంబో వేదికగా ఇరు జట్ల మధ్య రెండో వన్డే జరుగుతుంది.

**శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం**

**బంగ్లాదేశ్ జట్టు..**

లిట్టన్ కుమార్ దాస్ (కెప్టెన్), తంజిద్ హసన్ తమీమ్, పర్వేజ్ హుస్సేన్ ఎమోన్, మహ్మద్ నయీమ్ షేక్, తౌహిద్ హృదయ్, జాకెర్ అలీ అనిక్, షమీమ్ హుస్సేన్ పట్వారీ, మెహిదీ హసన్ మిరాజ్, రిషద్ హుస్సేన్, షాక్ మహిదీ హసన్, నసుమ్ అహ్మద్, తస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, షోరీఫుల్ ఇస్లాం, తంజిమ్ హసన్ సాకిబ్, మహ్మద్ సైఫుద్దీన్.

## కెప్టెన్ కావాలని ఉందా?
## రవీంద్ర జడేజా స్మైలీ రిప్లయ్ ఇదే!




ఇంటర్నెట్ డెస్క్: జాతీయ జట్టులోకి వచ్చిన ఏ క్రికెటర్‌కైనా భవిష్యత్తులో సారథిగా బాధ్యతలు చేపట్టాలనే ఆకాంక్ష ఉండటం సహజమే. కాస్త సీనియార్టీ వచ్చాక సారథ్యం వస్తుందేమోననే ఆశలూ పెరుగుతాయి. సరిగ్గా ఇదే స్థితిలో భారత సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఉన్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టుల నుంచి వైదొలగడం, బుమ్రాపై పనిభారం ఒత్తిడి లేకుండా చేసేందుకు సారథ్యం ఇవ్వకపోవడంతో జడేజానే తర్వాత ఆప్షన్‌గా నిలిచాడు. కానీ, అతడికి బదులు యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ దక్కింది. ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు రెండో రోజు జడేజా (89) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో విలేకర్ల నుంచి 'సారథ్యం'పై జడేజాకు ప్రశ్న ఎదురైంది. దీనికి అతడు స్పందిస్తూ.. "అదేం లేదు. ఆ సమయం వెళ్లిపోయింది" అంటూ నవ్వేశాడు. "గిల్‌తో కలిసి బ్యాటింగ్ చేసినప్పుడు అతడి కాన్ఫిడెన్స్ స్థాయిని గమనించా. చాలా అద్భుతంగా ఉంది. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు అసలు సారథిగా కనిపించలేదు. అదనపు బాధ్యతలను మోసేందుకు సిద్ధంగా ఉన్నాడు. దురదృష్టవశాత్తూ క్యాచ్ వెళ్లింది కానీ, గిల్ ఔట్ అవుతాడని అస్సలు అనుకోలేదు. మేమిద్దరం కలిసి బ్యాటింగ్ చేస్తున్నప్పుడు భాగస్వామ్యం ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై చర్చించుకుంటూనే ఉన్నాం. కొత్త బంతిని కాసేపు అడ్డుకోగలిగితే ఆ తర్వాత పరుగులు చేయడం సులువని నాకర్థమైంది. లంచ్ వరకూ బ్యాటింగ్ చేయగలిగా. ఆ తర్వాత గిల్‌తో కలిసి వాషింగ్టన్ సుందర్ మంచి పార్టనర్‌షిప్ ఇచ్చాడు. ఇంగ్లాండ్‌లో ఏ దశలోనూ అత్యుత్తమంగా ఉన్నామని అనుకోకూడదు. భారీగా పరుగులు ఉంచాల్సిందే. మేం ఇప్పుడు అదే చేశాం" అని జడేజా వెల్లడించాడు. గిల్ - జడేజా ఆరో వికెట్‌కు 203 పరుగులను జోడించారు.

## జెమీ స్మిత్ సెంచరీ..
## మూడో రోజు లంచ్ బ్రేక్
## సమయానికి ఇంగ్లాండ్ 249/5



ఇంటర్నెట్ డెస్క్: అయిదు టెస్టుల సిరీస్‌లో భాగంగా బర్మింగ్ హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లాండ్, భారత్ మధ్య రెండో మ్యాచ్ జరుగుతోంది. ఓవర్‌నైట్ స్కోర్ 77/3తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్.. లంచ్ బ్రేక్ సమయానికి 249/5తో కొనసాగుతోంది. మూడో రోజు ఆట ప్రారంభంలో ఇంగ్లాండ్ వెనువెంటనే రెండు వికెట్లు కోల్పోయింది. కానీ తర్వాత నుంచి ఇంగ్లిష్ బ్యాటర్లు ప్రతిఘటిస్తున్నారు. లంచ్ బ్రేక్ సమయానికి క్రీజులో హ్యారీ బ్రూక్ (91), జెమీ స్మిత్ (%జీుఎఅవ నాఎత్ప్ర%) (102) ఉన్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 154 బంతుల్లో 165 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇప్పటికీ ఇంగ్లాండ్ జట్టు 338 పరుగుల వెనుకంజలో ఉంది. ఈ రోజు దాదాపు మరో 63 ఓవర్లపాటు ఆట కొనసాగే అవకాశముంది.

## బికినీ సూట్‌లో గ్లామర్‌తో మతిపోగొడుతున్న ప్రగ్యా జైస్వాల్






## మహేష్, రాజమౌళి సినిమా ఆ ఓటీటీలోనే...

దర్శక దిగ్గజం రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న ఎస్ఎస్ఎంబి29 సినిమా ఇప్పుడు మన దేశంలోనే కాదు అంతర్జాతీయ స్థాయిలోనూ సినీ వర్గాలను ఆకర్షిస్తోంది. తాజాగా ఈ సినిమా ఓటీటీ హక్కుల్ని విక్రయించారంటూ వస్తున్న వార్తలు కూడా సంచలనంగా మారాయి. దీనికి కారణం చరిత్రలోనే ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో ఈ సినిమా ఓటీటీ హక్కుల ధర పలకడమే. ఇప్పటి దాకా ఓటీటీలో అత్యధిక ధర పలికిన చిత్రంగా రాజమౌళి, రామ్‌చరణ్,ఎన్టీయార్‌ల సినిమా ఆర్‌ఆర్‌ఆర్ నిలుస్తోంది. ఆ తర్వాత సుకుమార్, అల్లు అర్జున్‌ల పుష్ప 2, లోకేష్ కనగరాజ్ హీరో విజయ్‌ల తమిళ చిత్రం లియో, అట్లీ, షారూఖ్‌ఖాన్‌ల హిందీ చిత్రం జవాన్, ప్రశాంత్ నీల్, ప్రభాస్‌ల సలార్, ఓంరౌత్, ప్రభాస్‌ల ఆదిపురుష్, సిద్ధార్థ్ ఆనంద్, షారూఖ్ ల పఠాన్ చిత్రాలు నిలుస్తున్నాయి ఇవన్నీ రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల మధ్య చెల్లించి నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్‌లు స్వంతం చేసుకున్నట్టు సమాచారం. వీటిలో ఆదిపురుష్, పఠాన్, పుష్ప2 తప్ప మిగిలినవన్నీ నెట్‌ఫ్లిక్స్ ఖాతాలోనే పడ్డాయి. తద్వారా భారతీయ సినిమాలకు అత్యధిక రేట్లకు కొనుగోలు చేయడంలో ఎవరికీ అందనంత స్థాయిలో నెట్‌ఫ్లిక్స్ దూసుకుపోతోంది. అదే క్రమంలో మరోసారి తన సత్తా చాటిన నెట్‌ఫ్లిక్స్ ఎస్ఎస్ఎంబి 29 హక్కుల్ని కూడా దక్కించుకుందని తెలుస్తోంది. ఇటీవలి కాలంలో మరే చిత్రానికి పెట్టనంత ధరను చెల్లించి ఈ చిత్రం పోస్ట్ థియేట్రికల్ ఓటీటీ స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసిందని తెలుస్తోంది. తద్వారా ఇది భారతీయ సినిమా చరిత్రలో అతిపెద్ద నాన్-థియేట్రికల్ డీల్స్‌గా నిలుస్తోందని సమాచారం. రాజమౌళి మునుపటి చిత్రం ఆర్‌ఆర్‌ఆర్ సైతం నెట్‌ఫ్లిక్స్‌లోనే ఆ సినిమాను కూడా భారీ ధరకు కొనుగోలు చేసిన నెట్‌ఫ్లిక్స్ ప్రారంభంలోనే అద్భుతమైన వీక్షక విజయం అందుకుంది, అంతేకాక ఆ సినిమా పాట ఆస్కార్ అందుకోవడంతో నెట్‌ఫ్లిక్స్‌కు మరోసారి కాసుల పంట పండింది. ఆ అవార్డ్ ద్వారా వచ్చిన ప్రపంచవ్యాప్త గుర్తింపుతో ఓటీటీలో ఆ సినిమాకు వీక్షకులు వెల్లువెత్తారు. దాంతో ఆర్‌ఆర్‌ఆర్‌కి భారీ ధర చెల్లించినప్పటికీ నెట్‌ఫ్లిక్స్ భారీ లాభాలను ఆర్జించడానికి ఇదో కారణం. ఈ నేపథ్యంలో రాజమౌళి చిత్రాలపై గురి కుదిరిన నెట్‌ఫ్లిక్స్ చాలా ముందస్తుగానే ఓటీటీ హక్కులపై కన్నేసింది. అపజయాలు అంతే తెలియని దర్శకుడు రూపొందిస్తున్న ఎస్ఎస్ఎంబి 29 చిత్రంలో ప్రియాంక చోప్రా వంటి ఇంటర్నేషనల్ స్టార్ ఉండడం అంతర్జాతీయ ప్రేక్షకుల్ని కూడా ఆకట్టుకునే అంశమే. అందుకే ఈ చిత్రం అత్యంత భారీ ధర పలికింది అనుకోవచ్చు. వచ్చే 2027లో విడుదల కానున్న ఈ భారీ చిత్రం ఇంకెన్నో సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

## ‘విశ్వంభర’లో ఊహించని ట్విస్ట్.. చిరు పాటనే రీమిక్స్ చేయబోతున్న మేకర్స్?



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం విశ్వంభర సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. సోషియో-ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమాకి సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో ఓ రీమిక్స్ సాంగ్ ఉండబోతోందని ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిరంజీవి నటించిన సూపర్ హిట్ సినిమాలోని ఏదైన ఒక పాటను ‘విశ్వంభర’ సినిమాలో రీమిక్స్ చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియదు కానీ సోషల్ మీడియాలో దీనిపై పెద్ద చర్చ జరుగుతోంది. బాలీవుడ్ నటి మౌని రాయ్ ఈ స్పెషల్ సాంగ్ లో చిరంజీవితో కలిసి స్టెప్పులు వేయనున్నారని కూడా సమాచారం. ‘విశ్వంభర’ సినిమాకు ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



## ‘పుష్ప 2’ రికార్డు బ్రేక్ చేసిన ‘హరి హర వీరమల్లు’..

# 24 గంటల్లోనే రికార్డుల మోత!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు నిన్నటినుంచి సంబరాలు చేసుకుంటున్నారు. చాలా రోజులుగా ఫ్యాన్స్ ఎదురుచూసిన హరిహర వీరమల్లు ట్రైలర్ గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ విడుదలైన 24 గంటల్లోనే అద్భుతమైన రికార్డులను సృష్టించి టాలీవుడ్‌లో సరికొత్త చరిత్రను లిఖిస్తుంది. ఇప్పటివరకు 24 గంటల్లో యూట్యూబ్‌లో అత్యధిక వ్యూస్ సాధించిన ట్రైలర్‌గా అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 పేరిటా ఈ రికార్డు ఉండగా.. ఇప్పుడది హరి హర వీరమల్లు సొంతం చేసుకుంది. ఈ చిత్రం కేవలం 24 గంటల్లో తెలుగులో మాత్రమే 48 మిలియన్లకు పైగా (4.8 కోట్ల) వ్యూస్ సాధించి, తెలుగు చిత్ర పరిశ్రమలో 24 గంటల్లో అత్యధిక వ్యూస్ పొందిన ట్రైలర్‌గా నిలిచింది. అలాగే అన్ని భాషల్లో కలిపి ఈ ట్రైలర్ 61.7 మిలియన్లకు పైగా (6.17 కోట్ల) వ్యూస్ సాధించిందని చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. దీంతో టాలీవుడ్ చరిత్రలో ఈ రికార్డు సాధించిన మొదటి చిత్రంగా హరి హర వీరమల్లు రికార్డులకెక్కింది. ఈ ట్రైలర్‌లో పవన్ కళ్యాణ్ స్టైల్, డైలాగ్‌లు, యాక్షన్ సన్నివేశాలు అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక జూలై 24, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందో చూడాలి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.